Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 99487 49799

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

P.V.Narayana
☎: (S) 0891-2515158
74519 19119
NEELAM & SON'S
Ayurvedic & Homoeo
Dondaparthy, Akkayyapalem Main Road,
Opp. R.K.Vegetable Bazar,
Visakhapatnam-530 016
Email: neelamsons1930@gmail.com
THE ART OF LIVING

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 111 విశాఖపట్నం, 07 ఫిబ్రవరి 2024 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## జగన్‌ను నమ్ముకుంటే వాలంటీర్లు జైలుకెళ్లాల్సి వస్తుంది : చంద్రబాబు

**నెల్లూరు:** ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి సీఎం జగన్ మానసిక ఆందోళనలో ఉన్నారని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో ఏర్పాటుచేసిన 'రా.. కదలిరా' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అన్యాయం చేసిన భస్మాసురుడిని ఓటు ద్వారా భస్మం చేయాలని పిలుపునిచ్చారు.

"ఎన్నికల్లో ప్రజలు బటన్ నొక్కితే జగన్ మైండ్ బ్లాంక్ అవ్వాలి. జగన్‌ను నమ్ముకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుంది జాగ్రత్తగా ఉండాలని వాలంటీర్లను కోరుతున్నా. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ఉద్యోగాలు తీసేస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. కావాలనే వారిలో అభద్రతాభావం సృష్టిస్తున్నారు. వాలంటీర్లు ప్రజలకు సేవ చేస్తే మేం వ్యతిరేకం కాదు. కానీ, వైకాపాకు సేవ చేస్తే మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వాలంటీర్లకు రాజకీయాలొద్దు. మంచి పనులు చేసేవారికి సహకరిస్తాం.

భవిష్యత్‌లో కోతలు లేని నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నా. పేదరికం లేని రాష్ట్రాన్ని చూడాలనేది నా జీవిత ఆశయం. పెరిగిన సంపద పేదలకు చేరాలనేది నా సంకల్పం. తెలుగు జాతి



ప్రపంచంలో నంబర్‌వన్‌గా ఉండాలి. రాష్ట్రాన్ని కాపాడుకుందామని పిలుపునిస్తున్నా. వైకాపా ప్రభుత్వం వేధింపులు తట్టుకోలేక గల్లా జయదేవ్ రాజకీయాలు వదులుకున్నారు. రాజకీయ కక్షలతో పరిశ్రమలు తరిమేయడం బాధాకరం. దేశంలో 24శాతం నిరుద్యోగంతో ఏపీ అగ్రస్థానంలో ఉంది. యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత నాది. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తాం. ఉద్యోగం వచ్చేవరకు యువతకు రూ.3వేలు భృతి ఇస్తాం" అని హామీ ఇచ్చారు.

## అసెంబ్లీలో టీడీపీ రచ్చరచ్చ

- ఎమ్మెల్యేల సస్పెన్షన్
- బయట సర్పంచ్‌ల నిరసన




ఏపీ అసెంబ్లీలో ఇవాళ కూడా ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఓవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై గుర్రుగా ఉన్న విపక్ష టీడీపీ ఎమ్మెల్యేలు ఇవాళ కూడా ఆందోళనకు దిగారు. స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి నినాదాలు చేశారు. దీంతో సభలో వైసీపీ వర్సెస్ టీడీపీగా పరిస్థితి మారిపోయింది. మరోవైపు అసెంబ్లీ బయట రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించడం ఉద్రిక్తతలకు దారి తీసింది.

రాష్ట్రంలో ధరల పెరుగుదలపై చర్చ కోరుతూ విపక్ష టీడీపీ ఇవాళ స్పీకర్‌కు వాయిదా తీర్మానం ఇచ్చింది. ధరల పెరుగుదలపై ప్రభుత్వం చర్చించాలని పట్టుబట్టింది. దీనికి స్పీకర్ అంగీకరించకపోవడంతో టీడీపీ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పేపర్లు చించేసి స్పీకర్ పై విసురుతూ టీడీపీ సభ్యులు రెచ్చిపోయారు. టీడీపీ తీరుపై మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోవైపు అసెంబ్లీ బయట సర్పంచ్ లు నిరసనలు చేపట్టారు. అసెంబ్లీ ముట్టడికి వచ్చిన సర్పంచ్ లను పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన సర్పంచ్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయినా పోలీసుల కళ్లుగప్పి రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి సర్పంచ్ లు ఛలో అసెంబ్లీకి తరలివచ్చారు. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం దారిమళ్లించిందని, వాటిని తమ ఖాతాల్లో జమ చేయాలని సర్పంచ్లు డిమాండ్ చేశారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు స్థానిక పోలీసు

(మిగతా 2లో)

## పోలవరం నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలని రాజ్యసభలో బిజెపి ఎంపీ జీవీఎల్ డిమాండ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పోలవరం జాతీయ ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి పోలవరం సాగునీటి ప్రాజెక్టు అని పేరు పెట్టాలని కేంద్రాన్ని కోరారు జీవీఎల్. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని జీవీఎల్ పార్లమెంటులో తీవ్రంగా దుయ్యబట్టారు. రాజ్యసభలో బిజెపి పార్లమెంటు సభ్యులు జివిఎల్ నరసింహారావు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత మరియు గత రాష్ట్ర ప్రభుత్వాలు అనేక


(మిగతా 2లో)

## జిల్లాలో నేషనల్ డిఫెన్స్ కాలేజ్ బృందం పర్యటన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** క్షేత్ర పర్యటనలో భాగంగా 16 మందితో కూడిన జాతీయ భద్రతా కళాశాల, ఢిల్లీ (నేషనల్ డిఫెన్స్ కాలేజీ) బృందం విశాఖలో పర్యటిస్తోంది. మూడు రోజుల పాటు జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును ఈ బృందం పర్యవేక్షణ చేయనున్నది. ఎయిర్ వైస్ మార్షల్ మనీష్ కుమార్ గుప్త నేతృత్వంలోని ఈ బృందం మంగళవారం జిల్లా కలెక్టర్ డా ఏ మల్లిఖార్జునను కలెక్టరేట్‌లో ఛాంబర్‌లో కలిశారు. జిల్లాలో పర్యటన చేస్తున్న బృంద సభ్యులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమ వివరాలను కలెక్టర్ డా॥ ఎ. మల్లిఖార్జున బృంద సభ్యులకు తెలిపారు. వైద్యం, విద్య , వ్యవసాయం, యువతకు వృత్తి నైపుణ్యత , ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను వారికి వివరించారు. ఈ బృందంలో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కు చెందిన అధికారులు, వివిధ దేశాలకు చెందిన సైనిక అధికారులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

(మిగతా 2లో)




## ఆడుదాం - ఆంధ్రకు విస్తృత ప్రచారం కల్పించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు మరింత అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం - ఆంధ్ర రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ కె. ఎస్. విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు విశాఖపట్టణం వేదికగా జరిగే ఆడుదాం - ఆంధ్ర పోటీలకు సంబంధించిన ప్రచార ఏర్పాట్లపై మంగళవారం ఉదయం ఏడీసీ తన ఛాంబర్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాప్, క్రీడా ప్రాధికార సంస్థ, సమాచార పౌర సంబంధాల శాఖ, జీవీఎంసీ జోనల్ కమిషనర్లు, ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడళ్లలో, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో హోర్డింగులు, జెండాలు, బిల్ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు దూర ప్రాంతాల నుంచి వస్తారు కాబట్టి వారికి స్వాగతం పలుకుతూ నగరం ప్రారంభంలో ఆనందపురం, అనకాపల్లి, గాజువాక, అగనంపూడి ప్రాంతాల్లో హోర్డింగులు పెట్టాలని సూచించారు. రైల్వే, బస్ స్టేషన్లలో వెల్కం కౌంటర్లు ఏర్పాటు చేయాలని, అక్కడ కూడా ఆడుదాం - ఆంధ్ర క్రీడా విశేషాలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. క్రీడాకారులు బస చేసే చోట నుంచి క్రీడా మైదానాలకు వచ్చే దారుల్లో ప్రధానంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఎయిర్ పోర్టు నుంచి పీఎం పాలెంలోని ఏసీఏ క్రికెట్ స్టేడియం వరకు రోడ్లకు ఇరువైపులా, మధ్యలో ఆడుదాం - ఆంధ్ర విశిష్టతలను తెలుపుతూ హోర్డింగులు, బిల్ బోర్డులు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బస్సులపై ట్రాన్సిస్ట్ మోడల్లో స్ట్రిప్స్

(మిగతా 2లో)

## పార్కు నిర్మాణ పనులు త్వరతిగతిన పూర్తి చేయండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రజలకు ఆహ్లాదం కలిగించే పార్కుల అభివృద్ధి పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 8వ జోన్ 97వ వార్డు పరిధిలోని రత్నగిరి నగర్‌లో అభివృద్ధి చేస్తున్న థీమ్ పార్కును సందర్శించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదం కొరకు నగరంలో పలు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, రత్నగిరి నగర్ థీమ్ పార్కు పనులు మందకొడిగా సాగడం పై సంబంధిత కాంట్రాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనులు త్వరతిగతిన పూర్తి చేసి ఫిబ్రవరి 28వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. పార్కులను ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలు, పచ్చదనం, పెయింటింగ్, ఫౌంటెన్ మొదలైన పనులు వెంటనే పూర్తయ్యేలా చూడా లని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ రామ్మోహన్ రావు, ఏడిహెచ్ చక్రవర్తి, జోనల్ కమిషనర్ హైమావతి, ఏసీపి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక ఇంజనీరు రమణ, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



(మొదటి పేజీ తరువాయిలు)

## అసెంబ్లీలో టీడీపీ రచ్చరచ్చ

స్టేషన్లకు తరలించారు.

అటు అసెంబ్లీలో నిరసనలకు దిగిన టీడీపీ ఎమ్మెల్యేలను వారించేందుకు ఎంతగా ప్రయత్నించినా వారు వెనక్కి తగ్గకపోవడంతో స్పీకర్ తమ్మినేని సీతారాం వారిని ఇవాళ ఒక్కరోజు పాటు సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని సభ ఆమోదించింది. అనంతరం టీడీపీ సభ్యులు అసెంబ్లీ బయటకు వెళ్లి నిరసనలు చేపట్టారు.

## పోలవరం నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలని రాజ్యసభలో బిజెపి ఎంపీ జీవీఎల్ డిమాండ్

దశాబ్దాలుగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తగిన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా విమర్శించారు.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, కేంద్ర ప్రభుత్వం పోలవరానికి విడుదల చేసిన నిధులను పార్లమెంట్ ద్వారా తెలుగు ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశారు.

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ జీవీఎల్ ప్రశ్నకు సమాధానం ఇస్తూ పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.15,146 కోట్లు విడుదల చేసిందని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలని ఎంపీ జీవీఎల్ నరసింహారావు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కోరారు.

పోలవరం ప్రాజెక్టుకు ఖర్చు చేసే ప్రతి రూపాయి కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నందున ఆ ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి మోడీ పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టాలని ఎంపీ జీవీఎల్ కేంద్ర మంత్రిని కోరారు.

## జిల్లాలో నేషనల్ డిఫెన్స్ కాలేజ్ బృందం పర్యటన

అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వీరు అధ్యయనం చేయనున్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, అధికారులు, తదతరులు పాల్గొన్నారు.

## ఆడుదాం - ఆంధ్రకు విస్తృత ప్రచారం కల్పించాలి

పెట్టాలని దానికి సంబంధించిన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో బ్రాండింగ్ కమిటీలోని సభ్యులు, ఆయా జోన్ల కమిషనర్లు, శాప్, క్రీడాప్రాధికార సంస్థ అధికారులు సంయుక్త పర్యటన చేసి తనకు నివేదించాలని ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్ సమీక్షలో భాగంగా అధికారులను ఆదేశించారు.

సమావేశంలో శాప్ డీడీ రమణ, డీఎస్డీవో జూన్ గ్యాలియెట్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్, వివిధ జోన్ల కమిషనర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్స్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లాల హాకీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 9వ తేది నుంచి జరగబోవు 14వ అంతర్ జిల్లాల జూనియర్ ఊమెన్ హాకీ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు మంగళవారం అనకాపల్లి జిల్లా హాకీ ఆడాక్ కమిటి వైస్ చైర్మన్ కొఠారు నరేశ్ తెలియజేశారు. యలమంచిలి జూనియర్ కళాశాలలో జట్టు ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా హాకీ చైర్మన్ ఆడారి వీరు నాయుడు సహాయ సహకారంతో అంతర్ జిల్లాల హాకీ పోటీలకు క్రీడా కారులను పంపించడం జరుగుతున్నాదని, క్రీడాకారులంతా క్రమశిక్షణతో పోటీలో ప్రతిభ కనబరిచి జిల్లా పేరు ప్రఖ్యాతులు ఇనుమడింప చేయాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో అలిమేళ్ల రాజు, రాంబాబు, సీనియర్ కోచ్ శెట్టి రమేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## యుజియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** యునైటెడ్ గాయత్రి యూత్ మరియు కన్‌సర్న్ చారిటెబుల్ ట్రస్ట్ ఆధ్వరంలో జోన్ అవెన్యు హాస్టల్ నందు కొమ్మాది (గాయత్రీ కాలేజ ఎదురుగా) లో రక్త దాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ బ్లడ్ బ్యాంక్ వారు డాక్టర్స్ నర్సెస్ మరియు టెక్నీషియన్స్ కావాల్సిన సామాగ్రి తీసుకువచ్చి ఈ రక్తదాన శిబిరానికి సహకరించారు. ఈ రక్తదాన శిబిరంలో ప్రముఖంగా గాయత్రి, సెంచూరియన్ మరియు లెండి కాలెజ్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో 111 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ద్వారకమయి హస్టల్ prop. రాధాకృష్ణ. మరియు వాళ్ల బృందం వాలంటీర్స్‌కు సహకరించారు. కన్‌సర్న్ చారిటెబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ డా పి.కె. జోస్‌కి మరియు యునైటెడ్ గాయత్రి యూత్ విద్యార్థులకి లయన్స్ బ్లడ్ బ్యాంక్ ట్రస్ట్ పి.చంద్రశేఖర్ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియచేశారు. human Rights Council సభ్యులు హేమచంద్ర మరియు జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా॥ సందీప్ పంచకర్ల ఈ రక్తదాన శిబిరాన్ని సందర్శించారు.

## జనసేన పార్టీలో చేరిన వైసీపీ సీనియర్ మహిళా నేతలు యువకులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జనసేన విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా తూర్పు నియోజకవర్గ పరిధిలో 21 వార్డ్ వైసీపీ మాజీ మహిళా అధ్యక్షురాలు జనపాన పద్మ, వైసీపీ 13 వార్డ్ మహిళా సీనియర్ నాయకురాలు భూసు వరలక్ష్మి, 11వార్డ్ సీనియర్ మహిళా నాయకురాలు పిట్టా ఆదిలక్ష్మి రెడ్డి, 10 వార్డ్ మహిళా నాయకురాలు శ్రావణి, 28 వార్డ్ సీనియర్ మహిళా నాయకురాలు అరుణ శ్రీ, 12 వార్డ్ మహిళా నాయకురాలు కుమారి, 17 వార్డ్ సుమారు 100 కుటుంబాలు మరియు గాజువాక నియోజకవర్గ పరిధిలో 85 వార్డ్ యువజన విభాగం అధ్యక్షులు ఇళ్లపు వాసు, వైసీపీ సీనియర్ నాయకులు అయితి అప్పలరాజు, వైసీపీ నాయకులు ఏదురి అప్పారావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది జనసేన పార్టీ లో చేరారు. పార్టీ అధ్యక్షులు వంశీ గారు జనసేన కండువా వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ జనసేన పార్టీ లో ప్రత్యేక గుర్తింపు వుంటుందని, లాభాపేక్ష లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ అభివాదం తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారి ఆదేశానుసారం పార్టీ లో అన్ని విభాగాల కమిటీలు త్వరలో పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ వార్డ్‌ల అధ్యక్షులు ,నాయకులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ మరియు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 వందల మంది కౌలు రైతులకు ఇంకా రుణాలు అందనట్లు గుర్తించడం జరిగిందని, వారందరికీ రుణాలు మంజూరు చేయాలని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం క్రింద అర్హులైన అందరినీ నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. జగనన్న ఆసరా, చేయూత వంటి పథకాల పంపిణీ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో చేపడుతున్న సమయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అర్హులను నమోదు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో చేపడుతున్న ప్రాధాన్యతా కార్యక్రమాలలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని, జిల్లా అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. 2023 - 24 సంవత్సరంలో 2023 డిసెంబరు చివరి నాటికి ప్రాధాన్యతా రంగానికి రుణ లక్ష్యం రూ.2529 కోట్లు కాగా రూ.2350 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి 93 శాతం లక్ష్యాలు సాధించారని, ప్రాధాన్యతేతర రంగానికి రుణ లక్ష్యం రూ.438 కోట్లు కాగా రూ.590 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి 135 శాతం లక్ష్యాలు సాధించారని అన్నారు. కొన్ని బ్యాంకులు ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయడంలో వెనుకబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బుధ వారం నాటికి తగు నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కాని బ్యాంకులు జిల్లాలో వ్యాపార కార్యకలాపాలు ఎందుకు చేయాలని ఆయన ప్రశ్నించారు. జిల్లా ప్రజలను ఆర్థిక కార్యకలాపాలతో (ఫైనాన్షియల్ ఇంక్లుసన్) అనుసంధానం చేయడం అవస్యమని బ్యాంకులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటాల్ పెన్షన్ యోజన, ముద్రా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర అంశాలలో ప్రజలను నమోదు చేయాలని ఆయన చెప్పారు. స్వనిధి క్రింద పెండింగ్ లో ఉన్న 143 దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు.

**బిజినెస్ కరస్పాండెంట్ లకు లక్ష్యాలు ఇవ్వాలి**

బ్యాంకులు బిజినెస్ కరస్పాండెంట్ (బిసి)లకు లక్ష్యాలు నిర్దేశించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జన్ ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటాల్ పెన్షన్ యోజన, ముద్రా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర అంశాలలో ప్రజలను నమోదుకు బిజినెస్ కరస్పాండెంట్ లకు ప్రతి పది రోజులకు లక్ష్యాలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి మాట్లాడుతూ అశావాహ జిల్లాలో భాగంగా జన్ ధన్ యోజన, ముద్ర, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటాల్ పెన్షన్ యోజన తదితర అంశాలపై ప్రత్యేక డ్రైవ్ పెట్టామన్నారు. ఈ సమావేశంలో ఆర్బిఐ లీడ్ జిల్లా అధికారి పి.నాగ ప్రవీణ్, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ టి నాగార్జున, డి సి సి బి జనరల్ మేనేజర్ కె వాసు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, టి.పి.ఎం.యు వై.సత్యం నాయుడు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## సమ్మె జీవోలు విడుదల చేయాలి




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని గత పధహారు రోజులుగా సమ్మె చేపట్టిన మునిసిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చల ద్వారా జీవోలను విడుదల చేసి హామీలను అమలు చేస్తానని ప్రభుత్వ అధికారులు బహిరంగంగా ప్రకటించారని, నేడు సమ్మె విరమించి నెలరోజులు గడుస్తున్న ప్రభుత్వం పూర్తిగా విస్మరిచిపోయిందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్. శంకర్రావు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి. వెంకటరమణ ప్రభుత్వాన్ని విమర్శించారు.

రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక పార్వతీపురం డిఆర్ఓ ఇన్చార్జ్ కేశవ నాయుడుకు యూనియన్ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రాన్ని అందించారు.

ఈ సందర్భంగా ఎన్. శంకర్రావు, జి. వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వాపోయారు. సమ్మె ముగింపు రోజు జరిగిన ఒప్పందాల మేరకు జీవోలను రెండూ లేదా మూడు రోజుల్లోనే జారీ చేస్తామని నాడు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, అధికారులు హామీ ఇచ్చారని, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల చెల్లింపు విషయమై ఏర్పాటు చేసిన తొమ్మిది మంది అధికారుల కమిటీ నివేదికను జనవరి నెలాఖరులోపు నివేదిస్తామన్నారని అలాగే క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధమైన జీత భత్యాలు చెల్లింపు విషయమై జనవరి నెలాఖరులోపు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని అంగీకరించారని వాటిని పూర్తిగా మరిచారని తెలిపారు. క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్స్ కు సంబంధించి రూ. 21 వేలు, శానిటేషన్ డ్రైవర్లు, విలీన గ్రామపంచాయతీ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి రూ.21వేలు జీతం, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ 75000, దహన సంస్కారాలకు 20000, ఎక్స్ గ్రేషియో సాధారణ మృతికి రెండు లక్షలు, ప్రమాద మృతులకు ఐదు నుండి ఏడు లక్షలకు పెంపు, పర్మినెంట్ సిబ్బందికి సంబంధించి 20 కోట్ల రూపాయలకు పైగా బకాయి ఉన్న సరెండర్ లీవులు చెల్లింపులు, జిపిఎఫ్ అకౌంట్లు ప్రారంభం, క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్స్కు సంబంధించి సంక్షేమ పథకాలు అమలు తదితర జీఓలను నేటికీ జారీ చేయకపోవడం శోచనీయమని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కాలయాపన విడనాడి తక్షణమే జీవోలు జారీ చేయాలని అంగీకార ఒప్పందాల మేరకు తక్షణమే ఇంజనీరింగ్ కార్మికులు మరియు క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ ఫెడరేషన్, సీఐటీయూ డిమాండ్ చేస్తుందని లేకుంటే మరో పోరాటానికి సన్నద్ధం కానున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సింహాచలం, ఎం. శివ, ఎన్. మల్లేష్, నిర్మల, ఐ. శ్రీకాంత్, టి. జాన్, పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

## గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఆశా డే సందర్భంగా జిల్లా హాస్పిటల్ ప్రాంగణంలో గల పిపి యూనిట్ లో ఆశా డే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 9వ తేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంపై ఆశాలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఈ ఆశ యాప్ పైన గర్భిణీలకు రక్త హీనతపైన ఫ్యామిలీ డాక్టర్ విధానంపైన ఇతర ఆరోగ్య సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. బాలింతలకు, గర్భిణులకు ప్రసవ సమయం దగ్గర పడుతున్న గర్భిణీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతీ నెలా 9వ తేదీన జరిగే పిఎమ్ఎస్ఎమ్ఎ కార్యక్రమానికి గర్భిణీలు హాజరయ్యేటట్లు చూడాలన్నారు. కాన్పు సమయం దగ్గరగా ఉన్న వారిని, అరుదుగా ఉన్న బ్లడ్ గ్రూప్ తో ఉన్నవారిని గుర్తించాలన్నారు. సాధారణ ప్రసవాలు అన్నీ పిహెచ్సి లో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. హెచ్ఐవి, సిఫిలిస్, టిబి, షుగరు నిర్ధారణ పరీక్షలు ఖచ్చితంగా జరపాలన్నారు. గర్భస్థ పిండం ఎదుగుదల తీరు,లోపాలను గుర్తించేందుకు జరిపే టిఫ్ఫా స్కానింగ్ ఇప్పుడు ఆరోగ్యశ్రీ అనుబంధ ఆసుపత్రిలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని అన్నారు. హై రిస్క్ గర్భిణీ లను, రక్త హీనత గర్భిణీలను ఎనీమియా బారిన పడకుండా చూడాలన్నారు. ఆసుపత్రికి చేర్చేందుకు తల్లి-బిడ్డ ఎక్స్ప్రెస్ వాహనం అందుబాటులో ఉందన్నారు. అదేవిధంగా పిఎమ్ఎమ్ వివై, జెఎస్వై, ఆరోగ్య ఆసరా మొదలగు సంక్షేమ పథకాలు ఉన్నాయని, గర్భిణీల ఆరోగ్య శ్రేయస్సుకై ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య సేవలు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పిపి యూనిట్ వైద్యులు డా॥ మనోజ్ఞ, డా॥ లావణ్య, హెల్త్ సూపర్ వైజర్లు జయగౌడ్, పి. పుష్ప, ఇందిర, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాంగం

బుధవారం 07-02-2024

శోభకృత్ నామ సంవత్సరము

ఉత్తరాయణం , హేమంత ఋతువు

పుష్య మాసం

| | |
|---|---|
| తిథి | : బ. ద్వాదశి ఉ. 11.00 |
| నక్షత్రం | : పూర్వాషాఢ తె. 03.01 |
| వర్జ్యం | : ప. 01.00 ల 02.33 |

## ఈనెల 9న విమ్స్‌లో వైద్యుల పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నందు అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్యుల ఉద్యోగాల భర్తీ కోసం ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసిందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా ఎటువంటి రాత పరీక్ష లేకుండా కేవలం ఉత్తీర్ణత శాతం అలాగే రూల్ ఆఫ్ రిజర్వేషన్ బట్టి ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు అని పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న 19 వైద్య పోస్టులను భర్తీకు అర్హత కలిగిన వైద్యులు నేరుగా హాజరు కావచ్చని పేర్కొన్నారు. స్పెషాలిటీ వైద్యులు రూ.92,000, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు రూ .1,60,000 వేతనంతో కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీన హనుమంతవాక వద్ద గల విమ్స్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే వాక్ఇన్ ఇంటర్వ్యూకు ఆసక్తిగల వైద్యులు తమ ఉత్తీర్ణత పత్రాలతో పాటు మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు తీసుకొని హాజరు కావలసిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం http://dme.ap.nic.in వెబ్ సైట్‌ను సందర్శించాలని కోరారు

**ఖాళీల వివరాలు**

అనస్తీషియా-5, న్యూరో సర్జరీ-1, న్యూరాలజీ-2, కార్డియాలజీ-1, సర్జికల్ ఆంకాలజీ-2, ఎమర్జెన్సీ మెడిసిన్-1, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్)-3, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ-1, మెడికల్ అంకాలజీ-1, ప్లాస్టిక్ సర్జరీ-1, ఎండోక్రైనాలజీ-1, పల్మనాలజీ-1 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి



**పార్వతీపురం/బలిజిపేట, (విశాఖ సమాచారమ్):** మండలంలో గలావిల్లి, బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి(డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు మంగళవారం సందర్శించారు.ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివేదికల వివరాలు పరిశీలించారు. మైక్రోస్కోప్, ల్యాబ్ పరికరాల పనితీరును గమనించారు. పిహెచ్సిలో మందులు, వ్యాక్సిన్ నిల్వలు వాటి నిర్వహణ రికార్డులు తనిఖీ చేశారు. ప్రసూతి గదిలో డెలివరీ కొరకు అవసరమైన సదుపాయాలు ఏ మేరకు నిర్వహిస్తున్నారో పరిశీలించి, పిహెచ్సి లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పిహెచ్సిల్లో నిర్వహించిన ఆశాడే సమావేశంలో డాక్టర్ జగన్మోహన రావు పాల్గొని పలు ఆరోగ్య కార్యక్రమాల సమీక్ష చేశారు. ఈనెల 9 న నిర్వహించనున్న డీ వార్మింగ్ డే కార్యక్రమం కార్యచరణ సిద్ధం చేయాలన్నారు. సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలందరికీ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటిస్తూ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వేలు నిర్వహిస్తూ జ్వర లక్షణాలు, ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తిస్తే వెంటనే ప్రాథమిక చికిత్స అందజేసి, మలేరియా, డెంగ్యూ మొదలగు జ్వరం నిర్ధారణ అయితే వెంటనే సమాచారాన్ని డీఎంఓ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ త్వరగా జరగాలని, హై రిస్క్ గర్భిణీల ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలని సూచించారు.పిల్లలకు శత శాతం లక్ష్యంగా సకాలంలో టీకాలు వేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ కిరణ్మయి,సూపర్ వైజర్స్ కె.కర్ణ, వెంకటరమణ, చింతల్లి, చంద్రావతి, నాని, ఏఎన్ఎమ్ లు, సిహెచ్ఓలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ సమాచారమ్

బుధవారం 07-02-2024


## పెద్దదిక్కు వద్దు

ఇంటికి పెద్దదిక్కు ఉండాలి అంటారు. ఎందుకంటే నాలుగు మంచి మాటలు చెప్పడానికి మరియు ఎవరైనా తప్పు చేస్తే ఖండించడానికి. మాకు పెద్ద దిక్కే వద్దు, మంచి చెప్పే వాళ్లు వద్దు అని అంటే ఆ కుటుంబం ఎటుపోతుంది?

**కళ్లు గానక ఊబిలోనికి కూరుకుపోతారు :**

ఇదే దుర్యోధనుని విషయంలో జరిగింది. దుర్యోధనునికి తల్లిదండ్రులు ప్రేమ వలన చెప్పలేకపోయారు, విదురుడు మంత్రిత్వం వలన చెప్పలేక పోయాడు, భీష్ముడు పాపం తాతగారు, చనువు ఎక్కువ అయినా ఎన్నో సార్లు చెప్పి చూశాడు కానీ ఆయన్నీ లెక్క చేయలేదు. చివరికి రాజ్యమే కూలిపోయింది.

పెద్దలు లేని సంసారం, కుటుంబం ఏమవుతుందో తెలుసుకోవాలి.

నూరుగురు కౌరవులు ఏమయినారో మనం గుర్తుంచుకోవాలి, ధర్మాన్ని చెప్పేవాడు ఒక్కడైనా వుండాలి, అదే ధృతరాష్ట్రుని గొప్పతనం.

ధృతరాష్ట్రుడు విదురుడ్ని ప్రక్కన పెట్టుకున్నాడు, అందుకనే ఆయనకు శ్రీకృష్ణ విశ్వరూప దర్శనం లభించింది.

అదే శకునిని దగ్గర పెట్టుకొన్న దుర్యోధనుడి యొక్క స్థితి మనకు తెలుసు.

దుర్మార్గుడైనా సరే ఓ మహాత్ముడ్ని, మంచి వాడ్ని చెంత పెట్టుకోవాలి. దీనిని మనం బాగా పట్టుకోవాలి.

అదే ధర్మరాజు విషయంలో చూడండి. అందరి మాట విన్నాడు, ఆయన మాట ఆయన తమ్ముళ్లు విన్నారు, ధర్మ ప్రవర్తనతో బ్రతికారు.

దుర్యోధనుడు ఎవ్వరి మాట వినలేదు, తల్లిదండ్రుల మాట వినలేదు, గురువుల మాట వినలేదు, పెద్దల మాట వినలేదు, శ్రేయోభిలాషుల మాట వినలేదు, భగవంతుడి మాట కూడా వినలేదు చివరికి ఏమైయ్యాడు?

మంచి చెప్పే వాళ్లను బ్రతిమలాడికొనైనా తెచ్చుకోవాలి. "అయ్యా మీరు మార్గ నిర్దేశకులుగా ఉండండి, అధ్యక్షులుగా ఉండండి, పెద్దలుగా ఉండండి మాకు!" అని ప్రాధేయపడి ఉంచుకోవాలి.

పెద్దవాళ్లను వుంచుకున్నందు వలన కుటుంబాలకు, సంస్థలకు, సభలకు గౌరవం లభిస్తుంది, చెడ్డవాళ్లను డబ్బులు ఇచ్చి అయినా వదిలించు కోవాలి అంటారు. రాజు చెడ్డవాడు అయినా మహామంత్రి మంచివాడుగా, ధర్మం చెప్పేవాడుగా వుండాలి. అప్పుడే ఆ రాజు, ప్రజలు పది కాలాలు పాటు చల్లగా వుంటారు. ధర్మం చెప్పే పెద్దలు లేనందువలన లేదా చెప్పినా వినకపోవడం వలన సమాజం దెబ్బతింటుంది.

ఎవడికి వాడు నేనే పెద్ద అంటే ఎలాగా? అలాంటి జ్ఞానవంతులు వుంటేనే ఓక్కోసారి పొరబాట్లు, తప్పులు జరిగిపోతూ వుంటాయి.

అయ్యా శ్రీకృష్ణా! నేను ఏమి తప్పుజేశానని? అని భీష్ముడు శ్రీకృష్ణుల వారిని అడుగుతాడు. "ఓ తప్పు జరిగేచోట పెద్దలు వుండటమే తప్పు" అని అంటాడు. ఓ తప్పును చూస్తూ ఖండించకుండా, అక్కడ నుంచి వెళ్లిపోకుండా మౌనం వహించి చూస్తూ వుండటమే భీష్ముడు చేసిన తప్పు. ద్రౌపది వస్త్రాపహరణం సమయంలో భీష్ముడు ఏమీ చేయలేక అక్కడే వుండిపోయాడు.

అదే విదురుడు చూడకుండా వెళ్లిపోయినాడు.

కావున పెద్దలు ఓ తప్పు జరిగిన చోట ఉంటే ఆ పాపం వారి ఖాతాలో కూడా వేస్తారు. అందువలన చెప్పిన మాట విననప్పుడు పెద్దలు ఆ స్థలం నుంచి వెళ్లిపోతారు.

## ఎలక్ట్రోరల్ రోల్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ఎలక్ట్రోరల్ రోల్ పై వచ్చిన అభ్యర్థనలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిణి డా॥కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు.

ఎన్నికల సన్నద్ధత, ఎలక్ట్రోరల్ రోల్ పై మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సీపీ ప్రవీణ్ ఆదిత్య, వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలతో కలిసి సమీక్షించారు. ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, తుది ఓటర్ల జాబితాలోని సమస్యలు, మార్పులు చేర్పులు, 18-19 ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, వీవీపాడ్స్ స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు, సెక్టోరియల్ సిబ్బంది నియామకం, శిక్షణ, మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఖాళీల భర్తీ వివరాలు వంటి అంశాలపై ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈఆర్వో అప్రమత్తుతో విధులు నిర్వర్తించాలన్నారు. తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయాలన్నారు. జనవరి 22న ముద్రించిన తుది ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు మార్పులు, చేర్పులు, బదలాయింపు వంటి అంశాలకు సంబంధించిన ఫారం 6, 7, 8లను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాలో ఫొటోలు సక్రమంగా వుండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. 18-19 వయసు మధ్య ఉన్న యువతను ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులు స్పష్టం చేశారు. ప్రాముఖ్యంగా ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద విద్యుత్, తాగునీరు, వాహనాల రూట్ మ్యాప్ ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గాలలో ప్రతివారం రాజకీయ పార్టీ ప్రజలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి మండలానికి ఒక మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు వివరాలు అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు.

సమావేశంలో ఇన్చార్జి డీఆర్వో, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి, కాకినాడ కమిషనర్ జె.వెంకటరావు, కెఎస్ఈజెడ్ ఎస్డీసీ కేవీ రామలక్ష్మి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జే.సీతారామరావు, బిసి కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, డీపీవో కె భారతి సౌజన్య, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం ఎం. శ్రీనివాసు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన చిన్నా



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** మాడుగుల నియోజక వర్గం గొండుపాలెంలో 'రా.. కదలి రా' బహిరంగ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి మధురవాడ 5వ వార్డ్ బొరవాని పాలెం జాతీయ రహదారి పై మంగళవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని గ్యాస్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో మణి, నిరంజన్ అనే ఇద్దరు స్పాట్ లోనే మృతి చెందారు. మృతులు పెదవాల్తేరు చెందిన వారిగా గుర్తించారు. పియం పాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఈ నెల 9న పాడేరులో జాబ్ మేళా

**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యం పాడేరు నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈ నెల 9న "ఇండస్ట్రీ కస్టమైజ్డ్ ట్రైనింగ్ జాబ్ డ్రైవ్"ను ఏర్పాటు చేస్తునాము అని ఆంధ్రప్రదేశ్ ఏపీ ఏస్ ఎస్ డీ సి జిల్లా అధికారి జి ప్రశాంత్ కుమార్ మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ యొక్క జాబ్ డ్రైవ్‌ని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పాడేరు నందు తేదీ:09-02-2024న ఉదయం 10 గం. నుండి నిర్వహిస్తున్నామని, ఈ జాబ్ డ్రైవ్‌లో ప్రముఖ కంపెనీ అయిన డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలు హాజరుకానున్నారు అని తెలిపారు. కావున బి ఎస్ సి -కెమిస్ట్రీ, ఎం.ఎస్.సి ఆర్గానిక్ కెమిస్ట్రీ, (బి ఫార్మసీ, ఎం ఫార్మసీ) పూర్తి చేసుకున్న 27 స.ంలు లోపు నిరుద్యోగ యువకులు ఈయొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి మరియు జాబ్ డ్రైవ్ వచ్చే అభ్యర్థులు "skill universe.apssdc.in" వెబ్సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని రావాలి అని జి.ప్రశాంత్ కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్:9398338105 సంప్రదించగలరు అని కోరారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం

**అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాలు విద్యా సంస్థలలో ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సన్నద్ధంగా ఉందని ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అం గన్వాడీ, విద్యా సంస్థలలో చదువుకుంటున్న 1-19 సంవత్సరాల మధ్యవయస్కులైన పిల్లలు , కిషోర బాలబాలికలకు అల్బెం డజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రల్ని ఉచితంగా పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని ఆయన పేర్కొన్నారు.

జిల్లాల్లో 1.32 కోట్ల అల్బెండజోల్ 400 ఎం.జి మాత్రలు సిద్ధంగా ఉంచామన్నారు.

55608 అంగన్వాడీ కేంద్రాలు , 33666 ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లు, 3307 జూనియర్ కాలేజీలలో మాత్రల్ని పంపిణీ చేస్తారని తెలిపారు.

ఎంపీడీవోల ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల దినం నిర్వహణకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు.

జిల్లా కలెక్టర్లతో డిఎంహెచ్వోలు సమన్వయం చేసుకోవాలని, రాష్ట్ర స్థాయిలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జె.నివాస్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

తమ పిల్లల ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణ బాబు పిలుపునిచ్చారు.

ప్రస్తుతం రాష్ట్రంలో నులిపురుగుల సమస్యతో బాధపడుతున్న పిల్లల సంఖ్య 34 శాతం మేరఉందని అంచనా వేశామన్నారు. పొట్టలో నులిపురుగుల కారణంగా పోషకాల జీర్ణ ప్రక్రియకు ఆటంకం కలిగి శారీరక, మానసిక లోపాలకు, రక్తహీనతకు దారి తీస్తుందని తద్వారా పిల్లల్లో చురుకుదనం లోపించి నీరసపడిపోతారన్నారు. పర్యవసానంగా చదువు సంధ్యల్లోనూ వెనుకబడిపోతారన్నారు. ఈ సమస్యతో బాధపడే పిల్లలు తరచు అనారోగ్యంగా, అసలటగా వుంటూ, ఏకాగ్రత కోల్పోతారని, పాఠశాలకు తరచు గైర్హాజరవు తుంటారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పిల్లలకు అల్బెండజోల్‌తో చికిత్స సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన వైద్య పరిష్కారంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. 2016 లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా ఫిబ్రవరి 9న ఈ కార్యక్రమంతో పాటు ఫిబ్రవరి 16వ తేదీన తిరిగి మాప్అప్ దినాన్ని కూడా అమలు చేస్తోంది. రాష్ట్రంలో 1-19 ఏళ్ల మధ్య వయస్కులైన పిల్లలు, కిషోర బాలబాలిలు 1.32 కోట్ల మంది పున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 55,608 అంగన్వాడీ కేంద్రాలు, 33,666 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంకా 3,307 జూనియర్ కళాశాలల్లో ఈ నులిపురుగుల నిర్మూలనా దినం కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తుంది. అల్బెండజోల్ మాత్రల్ని అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తమ సంస్థల్లోని పిల్లలకు అందజేస్తారు. 1-1 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను , 2-3 సంవత్సరాల మధ్య పిల్లలకు పూర్తి మాత్రను మెత్తగా పొడి చేసి నీటిలో కలిపి ఇవ్వాలి. 3-19 మధ్య వయస్కులైన పిల్లలు మాత్రం పూర్తి మాత్రను సరిగ్గా నమిలి మింగేలా వారికి వివరించాలి. కార్యక్రమం అమలుకు ముందు సన్నద్ధత కోసం రాష్ట్ర స్థాయిలో జనవరి 31వ తేదీన అన్ని విభాగాల అధికారులు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటి వరకూ రెండుసార్లు జిల్లా స్థాయీ సమీక్షా సమావేశాలు నిర్వహించి సన్నద్ధతను సమీక్షించారు. అదే విధంగా మండల స్థాయిలో సైతం 3,850 సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఎంపిడిఓ, ఎఎన్ఎంలు విద్యా సంస్థలకు మందుల పంపిణీ బాధ్యత నిర్వహిస్తారు. ఎఎన్ఎంలు, తమ ప్రాంతంలోని అంగన్ వాడీ కేంద్రాలు, విద్యా సంస్థలకు మాత్రలు, పోస్టర్లు, కరపత్రాలు, రిపోర్టింగ్ ఫారాలను అందజేస్తారు. 1-5 సంవత్స రాల వయసు గల నమోదు కాని పిల్లలు, 6-19 మధ్య వయస్కులైన పాఠశాలలకు వెళ్లని పిల్లల జాబితాలను ఆశావర్కర్లు సిద్ధం చేయాలని, వారిని అంగన్వాడీ కేంద్రాలకు తరలించాలని వైద్య ఆరోగ్య సూచించింది. అదే విధంగా అంగన్వాడీ వర్కర్లు, విద్యా సంస్థలు ఉపాధ్యాయులు అన్ని మందులు, పోస్టర్లు, కరపత్రాలు, రిపోర్టింగ్ ఫారాలు, సురక్షితమైన తాగునీరు, ఓఆర్ఎస్ మాత్రలు, శుభ్రమైన స్పూన్లు, హాజరు రిజిస్టర్ల వంటి వాటిని సిద్ధం చేసుకోవాలని సూచించింది. ఈ నెల 9న అన్ని అంగన్వాడీ కేంద్రాలు, విద్యా సంస్థల్లో సూచించిన మోతాదు ప్రకారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించింది. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ సంస్థలలో డివార్మింగ్ కార్యక్రమాన్ని అనుమతించాలని స్పష్టం చేసింది. ఈనెల 9న ఆరోగ్య సమస్యల కారణంగా గైర్హాజరు కావటం లేదా ఇతర కారణాల వల్ల నులిపురుగుల నిర్మూలన జరగని పిల్లల జాబితాను అంగన్వాడీ వర్కర్లు, టీచర్లు సిద్ధం చేసుకుని వారికి ఫిబ్రవరి 16వ తేదీన ఈ మాత్రలను అందజేస్తారని తెలిపింది. ఈ రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పరిశీలించటం కోసం సంబంధిత ప్రభుత్వ విభాగాలకు చెందిన ఎవిడెన్స్ (ఎన్హెచ్ఎంతో సాంకేతిక, అవగాహనా ఒప్పందం కలిగిఉన్న) సంస్థలకు చెందిన పర్యవేక్షకులు అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలను సందర్శిస్తారని తెలిపింది. దీంతో పాటు ఎవిడెన్స్ యాక్షన్ నుండి టెలికాలర్లు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యా సంస్థలకు ఫోన్ చేసి కార్యక్రమానికి సంబంధించిన వివరాలు సేకరిస్తారని వివరించింది. ఇందుకు సంబంధించి ప్రతి అంగన్వాడీ కేంద్రం, పాఠశాల వద్ద సమీప పిహెచ్సి, ఎఎన్ఎం కాంటాక్ట్ నెంబర్ వుండాలని సూచించింది. కొంతమంది పిల్లలు వికారం, వాంతులు, విరోజనాలు, బలహీనత వంటి ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం వున్నప్పటికీ, ఇది కేవలం తాత్కాలిక సమస్య మాత్రమేనని, వీటిని సులభంగా తగ్గించవచ్చని సూచంచింది. ప్రతికూల సంఘటన జరిగిన సమయంలో పిల్లలను నీడ వున్న బహిరంగ ప్రదేశంలో పడుకోబెట్టి వారికి తాగునీరు అందించాలని తెలిపింది. మాత్ర గొంతులో ఇరుక్కోవటం వంటి ఘటనలో చోటు చేసుకున్నప్పుడు వారిని బోర్లా పడుకోబెట్టి వీపుపై తట్టాలని సూచించింది. ఒక వేళ తీవ్రమైన సందర్భాలు ఎదురైతే 104, 108 సేవలను వినియోగించుకోవాలని సూచించింది.


## రైల్వే జోన్ నిర్మాణం పనులు తక్షణమే చేపట్టి ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయండి

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** న్యూఢిల్లీలో రైల్వే బోర్డ్ చైర్మన్ జయ వర్మ సిన్హాని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతమ్మ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాల పై రైల్వే బోర్డు చైర్మన్‌తో చర్చించడం జరిగిందని పార్లమెంటు సభ్యురాలు తెలిపారు. అనకాపల్లి నియోజక వర్గంలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నటువంటి సత్యనారాయణపురం రైల్వే అండర్‌పాస్ నిర్మాణం కొరకు అనుమతులు ఇచ్చినందుకు, పూర్తిగా రైల్వే మంత్రిత్వ శాఖ ద్వారా నిర్మాణం చేపడుతున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా లంకెలపాలెం లెవెల్ క్రాసింగ్ దగ్గర రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు అనుమతులు ఇస్తూ పూర్తిగా రైల్వే నిధులతో నిర్మాణాలు చేపడుతున్నందుకు కూడా ధన్యవాదాలు తెలిపారు. దీనికోసం ఒక్కొక్క నిర్మాణానికి ఐదు పాయింట్ ఐదు కోట్ల చొప్పున రెండు అండర్ పాస్ నిర్మాణానికి 11 కోట్ల బడ్జెట్ ఎస్టిమేట్ ను ఇప్పటికే సౌత్ సెంట్రల్ జోనల్ అధికారులు ఒక డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేసి రైల్వే బోర్డు అనుమతి కొరకు పంపించడం జరిగిందని. దానిని త్వరితగతిన పరిశీలించి సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ కి డిఆర్ఎంకి పనులు ప్రారంభం అయ్యేలాగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అందుకు బోర్డ్ చైర్మన్ సానుకూలంగా స్పందించారని పార్లమెంట్ సభ్యురాలు సత్యవతమ్మ తెలిపారు. దీనికోసం ఒక్కొక్క నిర్మాణానికి ఐదు పాయింట్ ఐదు కోట్ల చొప్పున రెండు అండర్పాస్ల నిర్మాణానికి 11 కోట్ల బడ్జెట్ ఎస్టిమేట్ ను ఇప్పటికే సౌత్ సెంట్రల్ జోనల్ అధికారులు ఒక డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేసి రైల్వే బోర్డు అనుమతి కొరకు పంపించడం జరిగిందని దానిని త్వరితగతిన పరిశీలించి సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్‌కి మరియు డిఆర్ఎంకి పనులు ప్రారంభం అయ్యేలాగా ఆదేశాలు ఇవ్వాలని కోరడం జరిగింది .దానికి బోర్డ్ చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. అదేవిధంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు సంబంధించి జీవీఎంసీ అధికారులు 52.5 ఎకరాల స్థలాన్ని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్టర్ డివిజన్ డిఆర్ఎంకి స్థలాన్ని హ్యాండ్ ఓవర్ చేసుకోవాల్సిందిగా పంపించిన లేఖను రైల్వే మంత్రి రైల్వే బోర్డు చైర్మన్ కి వివరించినట్లు ఆమె తెలిపారు . ఇప్పటికే రైల్వే అధికారులు స్థలాన్ని పరిశీలించారని త్వరగా జోనల్ కార్యాలయ నిర్మాణాలు మొదలు



పెట్టినట్లయితే ఉత్తరాంధ్ర చిరకాల స్వప్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కల సాకారం అవుతుందని తద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కొత్త రైలు మార్గాలు నూతన ట్రైన్లు మరిన్ని అదనపు హంగులు విభజన ఆంధ్ర రాష్ట్రానికి త్వరగా అందుతాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవి కి మరియు రైల్వే బోర్డు చైర్మన్ జయవర్మసింహాకి తెలిపినట్లు ఎంపీ సత్యవతి వివరించారు.

# 5 నిమిషాల్లో ఈ ప్రమాదకరమైన క్యాన్సర్ గురించి ఇంట్లోనే తెలుసుకోవచ్చు




టెస్టిక్యులర్ క్యాన్సర్. టెస్టిక్యులర్ క్యాన్సర్ లేదా టెస్టిక్యులర్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారు. ఇది చాలా ప్రమాదకరమైన వ్యాధి. ఇందులో రోగి జీవించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ వ్యాధి పురుషులలో మాత్రమే సంభవిస్తుంది, ఎందుకంటే ఈ క్యాన్సర్ వృషణ క్యాన్సర్.

టెస్టిక్యులర్ క్యాన్సర్ వృషణాలలో మొదలవుతుంది. దీనిని వృషణాలు అని కూడా పిలుస్తారు. మగ జననేంద్రియాల క్రింద చర్మం యొక్క వదులుగా ఉండే సంచి ఉంది. దీనిని స్క్రోటమ్ అంటారు. వృషణాలు ఆ సంచి లోపల ఉన్నాయి. ఇవి స్పెర్మ్ మరియు టెస్టోస్టెరాన్‌ను ఉత్పత్తి చేస్తాయి. వృషణ క్యాన్సర్ అన్ని వయసుల పురుషులలో సంభవించవచ్చు. కానీ ప్రమాదం 15 మరియు 45 సంవత్సరాల మధ్య ఎక్కువగా ఉంటుంది.

వృషణంలో ఒక ముద్ద లేదా వాపు ఈ క్యాన్సర్ యొక్క మొదటి కనిపించే సంకేతం. ఇది సకాలంలో చేయకపోతే, క్యాన్సర్ కణాలు శరీరంలోని ఇతర భాగాలకు వేగంగా వ్యాప్తి చెందుతాయి. వృషణ క్యాన్సర్ యొక్క అత్యంత సాధారణ రకం జెర్మ్ సెల్ టెస్టిక్యులర్ క్యాన్సర్. ఈ కణాలు శరీరంలో స్పెర్మ్‌ను ఉత్పత్తి చేస్తాయి.

**లక్షణాలు:** ఒకటి లేదా రెండు వృషణాలలో గడ్డ లేదా వాపు, స్క్రోటమ్ యొక్క భారం యొక్క భావన, దిగువ ఉదరం లేదా కటి ప్రాంతంలో నొప్పి, స్క్రోటమ్ యొక్క వేగవంతమైన వాపు, స్క్రోటమ్ లేదా వృషణాలలో నొప్పి లేదా అసౌకర్యం అనిపిస్తుంది, ఛాతీ కణజాలం బలహీనపడటం లేదా విస్తరించడం, వెన్నునొప్పి.

**వృషణ క్యాన్సర్ కారణమవుతుంది:** వృషణ క్యాన్సర్‌కు ఖచ్చితమైన కారణం తెలియదు. కానీ కుటుంబంలో దాని చరిత్ర ఉంటే ప్రమాదం పెరుగుతుంది. ఇది కాకుండా, శిశువు యొక్క వృషణాలలో ఒకటి పూర్తిగా గర్భంలోని స్క్రోటమ్ లోపలికి వెళ్ళలేకపోతే, ఈ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. దీనిని క్రిప్టోర్కిడిజం లేదా అవరోహణ వృషణం అని కూడా అంటారు.

**5 నిమిషాల్లో పరీక్ష చేయండి:**

వేడి నీళ్లతో స్నానం చేసేటపుడు ఐదు నిమిషాలలో ఈ పరీక్షను మీరే చేసుకోవచ్చు. వేడి నీటితో స్నానం చేయడం ద్వారా దీనిని పరీక్షించడం సులభం అవుతుంది.

వృషణం యొక్క ఉపరితలం అనుభూతి చెందడానికి ఒక వైపు నుండి ప్రారంభించి, మీ వేళ్ళతో స్క్రోటమ్‌ను (వృషణాల)ను సున్నితంగా నొక్కుతూ తిప్పండి.

ఏదైనా గడ్డలు, వాపులు లేదా అసాధారణతలను గుర్తించడానికి ప్రయత్నించండి. క్యాన్సర్ కణితులు సాధారణంగా నొప్పిని కలిగించవని గుర్తుంచుకోండి.

కాలానుగుణంగా పరిమాణంలో మార్పులను గమనించండి. వృషణ క్యాన్సర్ యొక్క అత్యంత సాధారణ లక్షణం నొప్పి లేని గడ్డ, కొంతమంది పురుషులు వృషణాలు మరియు స్క్రోటమ్ యొక్క వాపును అనుభవించవచ్చు.

ఏదైనా తేలికపాటి నొప్పి లేదా బరువు కోసం అప్రమత్తంగా ఉండండి.

మరో వైపు మార్చండి మరియు ఇతర వృషణాన్ని పరీక్షించండి.

# పప్పు రోజూ తింటే షుగర్ కంట్రోల్‌లో ఉండటమే కాదు, గుండెకు కూడా మంచిది



ఎన్ని కూరలున్నా పప్పుతో చేసిన వంటకాల స్పెషాలిటీనే వేరు. కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు, బఠానీలు ఇలా ఏదైనా రుచి అద్భుతంగా ఉంటాయి. పప్పులు రుచిలోనే కాదు పోషకాల పరంగానూ గొప్పవే. పప్పుధాన్యాలలో కార్బోహైడ్రేట్స్, ఫైబర్, ఫోలేట్, ఐరన్, జింక్, క్యాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

**జీర్ణక్రియకు మేలు చేస్తుంది**

పప్పుధాన్యాలలో ప్రీబయోటిక్ ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మేలు చేస్తుంది, గట్ బ్యాక్టీరియాకు ఇంధనంలా పనిచేస్తుంది. ఇవి పేగుల కదలికలను మెరుగు పరుస్తాయి. పేగుల్లో బ్యాక్టీ రియా పెరగటానికీ తోడ్పడతాయి. ఫైబర్ కొలొలెక్టర్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు పేర్కొన్నాయి. పెద్దపేగు, ప్రొస్టేట్, జీర్ణాశయ, పాంక్రియాస్ క్యాన్సర్ల వంటి రకరకాల క్యాన్సర్ల నివారణకూ పప్పులు తోడ్పడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

**గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి**

పప్పులు రోజూరీ డైట్‌లో చేర్చుకుంటే గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుందని చెబుతున్నారు. పప్పులలో ఫొలెట్ సమృద్ధిగా ఉంటుంది, ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కూడా సహాయపడుతుంది. పప్పులలోని ఫోలేట్, ఐరన్, విటమిన్ బి1 పుష్కలంగా ఉండటం వల్ల గుటడం ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఈ పోషకాలకు హైపర్‌టెన్షన్, చెడుకొలెస్ట్రాల్‌ను తగ్గించే సామర్థ్యం ఉంది. పప్పుల్లో కొవ్వు తక్కువ. అ మాటకొస్తే కొలెస్ట్రాల్ అసలే ఉండదు. అందువల్ల గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

**రక్తంలో చక్కెరస్థాయిలు కంట్రోల్‌లో ఉంటాయి**

పప్పులలోని ఫైబర్, ప్రొటీన్‌లు ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తాయి. రక్తంలో గ్లూకోజు త్వరగా కలవకుండా చూస్తాయి. ఇలా గ్లూకోజును అదుపులో ఉంచుతాయి. పప్పుధాన్యాలలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది శక్తిని రక్తప్రవాహంలోకి పంపిణీ చేసే వేగాన్ని తగ్గిస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్‌లో ఉంచుతుంది.

**ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి**

పప్పుధాన్యాలు ప్రొటీన్ అద్భుతమూలం. ఒక కప్పు ఉడికించిన పప్పుల్లో సుమారు 230 కేలరీలు, 17.9 గ్రాముల ప్రొటీన్, 15.6 గ్రాముల పీచు, 0.8 గ్రాముల కొవ్వు ఉంటాయి. వీటితో అమైనో యాసిడ్స్ ముఖ్యంగా లైసిన్ సైతం అందుతుంది. వీటిల్లోని ప్రొటీన్, అమైనో యాసిడ్స్ వీరికి ఎంతో మేలు చేస్తాయి.

**శక్తిని అందిస్తుంది**

పప్పులలో ఐరన్ అధికంగా ఉంటుంది, ఇది మీకు రోజంతా అవసరమైన శక్తిని అందిస్తుంది. ప్రత్యేకించి మీకు రక్తహీనత ఉంటే. ఎర్ర రక్త కణాలలో హిమోగ్లోబిన్, ఇది ఐరన్ నుంచి తయారవుతుంది, శరీరమంతా ఆక్సిజన్‌ను రవాణా చేయడానికి వీలు కల్పిస్తుంది. శరీరం ఐరన్‌ను సమర్థవంతంగా గ్రహించుకోవడానికి పప్పులో టమాటాలు, క్యాప్సికమ్ వంటి విటమిన్ సి రిచ్ ఫుడ్స్ వేసి తీసుకోండి.

**దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది**

రోజూ పప్పు తినడం వల్ల డయాబెటిస్, ఊబకాయం, క్యాన్సర్, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. పప్పుధాన్యాలలో కార్డియోప్రొటెక్టివ్, యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు అనారోగ్యాల నుంచి రక్షిస్తాయి.

# టమాటల్ని ఇలా తీసుకుంటే బాడీలోని కొలెస్ట్రాల్ కరిగిపోతుందంట



మంచి లైఫ్‌స్టైల్, ప్రాసెస్డ్ ఫుడ్, ఫ్రైడ్ ఫుడ్స్, జంక్ ఫుడ్, కార్బోహైడ్రేట్ ఫుడ్స్ తీసుకోవడం, వర్కౌట్ చేయకపోవడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అయితే, టమాటని వాడడం వల్ల ఈ కొలెస్ట్రాల్‌ని కరిగించుకోవచ్చు. మనం ఎక్కువగా వాడే కూరగాయల్లో టమాట ఒకటి. దీని వల్ల ఎన్నో బెనిఫిట్స్ ఉన్నాయి. మరీ ముఖ్యంగా, కొలెస్ట్రాల్‌ని కూడా కరిగించుకోవచ్చు.

**టమాటల్లో** : టమాటల్లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల టమాటాల్లో చాలా పోషకాలు ఉన్నాయి. టమాట జ్యూస్‌లో కేలరీలు, పిండి పదార్థాలు, ప్రోటీన్, హెల్దీ ఫ్యాట్స్, ఫైబర్‌తతో పాటు పోషకాలు పుష్కంగా ఉంటాయి.

**కొలెస్ట్రాల్‌ని తగ్గించే టమాట జ్యూస్:** చెడు కొలెస్ట్రాల్ పేరుకు పోయినప్పుడు రక్త నాళాలు మూసుకుపోతాయి. దీని కారణంగా, గుండె పోటు, స్ట్రోక్, కరోనరీ స్ట్రోక్స్, ఊబకాయం, హైబీపి వంటి సమస్యలు వస్తాయి. టమాటల్ని డైట్‌లో చేర్చితే చెడు కొలెస్ట్రాల్ కంట్రోల్ అవుతుంది. టమాటల్లోని యాంటీ ఆక్సిడెంట్ చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండె ధమనుల్లో ఫలకం ఏర్పడకుండా కంట్రోల్ చేస్తుంది.

**బరువు తగ్గడం** : టమాట జ్యూస్ తాగితే కొలెస్ట్రాల్ తగ్గి బరువు కూడా తగ్గుతారు. దీంతో పాటు రక్తంలో షుగర్ లెవల్స్ తగ్గి, గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తుంది. కాబట్టి, రెగ్యులర్‌గా టమాటని తీసుకోవడం లేదా జ్యూస్ తాగడం వల్ల చాలా వరకూ ఆరోగ్యానికి చాలా మంచిది.

**హైబీపి:** హైబీపితో బాధపడేవారికి టమాటలు అద్భుత ఔషధం. అందుకోసం రోజుకి ఓ పండుని తీసుకుంటే రక్తపోటు కంట్రోల్ అవుతుంది. దీంతో పాటు హెల్దీ లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వాలి.

# ఉదయం పూట టిఫిన్ మానేస్తున్నారా?



బ్రేక్‌ఫాస్ట్. మీ రోజును యాక్టివ్‌గా స్టార్ట్ చేయడానికి ఎంతో అవసరం. బ్రేక్‌ఫాస్ట్ మన శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఇది మీ రోజుకు ఇంధనంలా పనిచేస్తుంది. బ్రేక్‌ఫాస్ట్ అభిజ్ఞా పనితీరును మెరుగుపరుస్తుంది, బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది, గుండె ఆరోగ్యాన్ని రక్షిస్తుంది, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాల ముప్పును తగ్గిస్తుంది. అయితే, పనిబిజీలో పడి కొందరు, బరువు తగ్గాలని మరికొందరు ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్‌ను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. అయితే, ఉదయం పూట టిఫిన్ మానేస్తే.. అనేక దుష్ప్రభావాలు ఎదురవుతాయని నిపుణులు అంటున్నారు. బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేస్తే.. మీరు ముఖ్యమైన పోషకాలను, రోజులో అతిగా తినే అవకాశం ఉంది. బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేసే వ్యక్తులు రోజులో ఎక్కువ కేలరీలు, చక్కెర ఉన్న ఆహారాన్ని తీసుకుంటాని కొన్ని అధ్యయనాలు పేర్కొన్నాయి. ఇది వ్యక్తి ఆరోగ్యం, వెయిట్ కంట్రోల్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**శక్తి స్థాయిలు తగ్గుతాయి** బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేస్తే.. రోజంతా నీరసంగా, శక్తి స్థాయిలు తక్కువగా ఉంటాయి. మీరు ఏ పనిపైనా దృష్టి పెట్టలేరు. దీనిని దృష్టిలో ఉంచుకుని మీ టిఫిన్‌లో సంక్లిష్ట కార్బోహైడ్రేట్‌లు, ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన సమతుల్య ఆహారాన్ని మీ బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోండి. ఇది మీ శక్తి స్థాయిలను నిర్వహించడానికి సహాయపడతాయి.

**ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గుతాయి**

మీ ఉదయం పూట తీసుకునే ఆహారం మెదడు సరైన రీతిలో పనిచేయడానికి అవసరమైన ఇంధనాన్ని అందిస్తుంది. మీరు బ్రేక్‌ఫాస్ట్ మానేస్తే.. మీ ఏకాగ్రత దెబ్బతింటుంది, జ్ఞాపకశక్తి కూడా తగ్గుతుంది. దీన్ని పరిష్కరించడానికి.. తృణధాన్యాలు, పండ్లు, ఒమేగా - 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న నట్స్, గింజలు వంటి మెదడుకు మేలు చేసే ఆహారాలను మీ ఉదయం పూట ఆహారంలో చేర్చుకోండి.

**అతిగా తింటారు** మీరు బ్రేక్‌ఫాస్ట్ మానేస్తుంటే.. ఆ రోజుంతా ఆకలిగా అనిపిస్తుంది. దీంతో అతిగా ఆహారం తీసుకునే అవకాశం ఉంది. దీంతో బరువు కూడా పెరుగుతారు. బదులుగా కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే సమతుల్య ఆహారం మిమ్మల్ని సంతృప్తికరంగా ఉంచుతుంది. తద్వారా మీ బరువు కూడా కంట్రోల్‌లో ఉంటుంది.

**పోషకలోపానికి దారితీస్తుంది:** విటమిన్లు, మినరల్స్, ఫైబర్, ప్రొటీన్ వంటి పోషకాలు మన శరీరానికి సమృద్ధిగా అందడానికి బ్రేక్‌ఫాస్ట్ ఒక గొప్ప మార్గం. మీ శరీరానికి పోషకాలు సమృద్ధిగా అందడానికి పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, పాల ఉత్పత్తులు వంటి పోషకాలు అధి కంగా ఉండే ఆహారాలను మీ డైట్‌లో చేర్చండి.

**జీవక్రియ మందగిస్తుంది** : ఉదయం పూట అల్పాహారం స్కిప్‌చేస్తే జీవక్రియపై ప్రతికూల ప్రభావం పడుతుంది, వెయిట్ మెయింటేనెన్స్ సవాలుగా మారుతుంది. దీంతో మీరు బరువు పెరిగే అవకాశం ఉంది. మీ జీవక్రియను బూస్ట్ చేయడానికి సమతుల్య ఆహారం తీసుకోండి. సరైన జీవక్రియ పనితీరు కోసం లీన్ ప్రొటీన్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోండి.

**దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు పెరుగుతుంది** : తరచు బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల గుండె జబ్బులు, ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాల ముప్పు పెరుగుతుంది. ఉదయం పూట అల్పాహారం దాటవేస్తే.. గుండె సమస్యల ముప్పు తగ్గుతుందని మౌంట్ సినానీలోని ఇక్హాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ నిర్వహించిన అధ్యయనంలో తేలింది.


**మూడ్ స్వింగ్స్ ఉంటాయ్** : ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్ మానేస్తే మానసిక కల్లోలం, చిరాకు, నిరాశ ఎదురవుతాయి. ఇది మీ మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

# ఈ ఆహారాలు ఎక్కువగా తింటే కాల్షియం లోపిస్తుంది

మన శరీరం మొత్తం ఎముకలపైనే ఆధారపడి ఉంటుంది. కండరాలకు దన్నుగా నిలుస్తూ శరీరానికి స్థిరమైన ఆకారాన్ని కల్పించేవి ఎముకలే. ఇవి మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలను రక్షిస్తాయి. ఎముకలలో ఎర్ర రక్త కణాలు తయారవుతాయి, ఇవి రక్తం తయారీకి సహాయపడతాయి. ఎముకలు కలిసి కీళ్లను ఏర్పరుస్తాయి. వాటికి సరైన నిర్మాణాన్ని అందిస్తాయి, తేలికగా కదలటానికి, చురుకుగా ఉండటానికి ఎముకలు బలంగా ఉండటం ఎంతైనా అవసరం. మొత్తంమీద, ఎముకలలో ఎలాంటి లోపం ఉన్నా.. మొత్తం శరీరానికే భారంగా మారుతుంది.

ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా ఉండేందుకు అవసరమైన అత్యంత ముఖ్యమైన పోషకం కాల్షియం. మన శరీరంలో దానంతట అది కాల్షియం తయారు చేసుకోలేదు. మనం తీసుకునే ఆహారం, సప్లిమెంట్ల ద్వారానే కాల్షియంను పొందాలి. మన డైట్‌లో సరిపడా కాల్షియం తీసుకోకపోవడం, కాల్షియం శోషణకు ఆటంకం కలగటం వల్ల.. కాల్షియం లోపం తలెత్తే అవకాశం ఉంది. కొన్ని ఆహార పదార్థాలు శరీరంలో కాల్షియం శోషణను అడ్డుకుంటాయని స్పష్టం చేసింది. అవి ఎక్కువగా తీసుకుంటే.. కాల్షియం లోపం తలెత్తే ప్రమాదం ఉందన నిపుణులు చెబుతున్నారు.

**మాంసం, హై ప్రొటీన్ ఫుడ్స్** : ఎముకల ఆరోగ్యానికి ప్రొటీన్ చాలా అవసరం, కానీ ప్రొటీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎముకలకు హాని జరిగే ప్రమాదం ఉంది. ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం అధికంగా తింటే శరీరంలో కాల్షియం లోపం ఏర్పడుతుంది. మీ ఎముకలను దృఢంగా ఉంచుకోవడానికి ప్రొటీన్, కాల్షియం రెండూ



ఉండే ఆహారాలను మీ డైట్‌లో ఎక్కువ చేర్చుకోండి. పాల ఉత్పత్తులలో ఈ పోషకాలు రెండూ ఉంటాయి.

**బీన్స్** : బీన్స్‌లో కాల్షియం, మెగ్నీషియం, ఫైబర్, ఇతర పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, బీన్స్‌లో ఫైటేట్స్ అనే పదార్థాలు కూడా ఎక్కువగా ఉంటాయి. బీన్స్‌లోని కాల్షియాన్ని గ్రహించే, శరీరం సామర్థ్యాన్ని ఫైటేట్స్ అడ్డుకుంటాయి. మీరు బీన్స్‌ను ఒక గంటపాటు నీటిలో నానబెట్టి, ఆపై వాటిని మంచినీటిలో ఉడికిస్తే ఫైటేట్ స్థాయిలను తగ్గించవచ్చు.

**ఉప్పు** : ఉప్పు ఎక్కువగా తింటే శరీరంలో కాల్షియం లోపం తలెత్తుతుందని నిపుణులు చెబుతున్నారు. ఉప్పులో సోడియం ఉంటుంది.. ఇది శరీరంలోని కాల్షియాన్ని క్షీణింపజేస్తుంది, ఎముకల నష్టానికి దారితీస్తుంది. మీ ఎముకలను ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుకోవడానికి తక్కువ ప్రాసెస్ చేసిన ఆహారాలు, ప్యాక్ చేసిన ఆహారాలు, ఉప్పు తక్కువగా తీసుకోవాలి. రోజుకు 2,300 మిల్లీగ్రాముల కంటే ఎక్కువ సోడియం తీసుకోవద్దు.

**పాలకూర** : బచ్చలికూర వంటి అక్సలేట్ (ఆక్సాలిక్ యాసిడ్) అధికంగా ఉండే ఆహారాల నుంచి మీ శరీరం కాల్షియంను సరిగ్గా గ్రహించలేదు. చిక్కుళ్లు, కొన్ని దుంప కూరల్లోనూ ఆక్సలేట్స్ ఉంటాయి. ఈ ఆహార పదార్థాల్లో పోషకాలు అధికంగా ఉన్నప్పటికీ ఇవి ఎక్కువగా తింటే కాల్షియం లోపానికి దారితీస్తుంది.

**గోధుమ ఊక** : బీన్స్‌లో ఉన్నట్లే గోధుమ ఊకలోనూ అధిక మొత్తంలో ఫైటేట్‌లు ఉంటాయి. ఇది శరీరం కాల్షియాన్ని గ్రహించకుండా నిరోధించగలదు. మీరు పాలు, 100% గోధుమ ఊక ఆహారం తిన్నప్పుడు.. మీ శరీరం పాలలోని కాల్షియంను గ్రహించలేదు. బ్రెడ్‌లో చాలా తక్కువ మొత్తంలో గోధుమ ఊక ఉంటుంది, ఇది కాల్షియం శోషణపై ప్రభావం చూపదు.

**ఇవి కూడా** : ఆల్కహాల్ - అధిక మొత్తంలో ఆల్కహాల్ తాగడం వల్ల ఎముకలు దెబ్బతింటాయి. మద్యం వినియోగాన్ని పరిమితం చేయాలని నిర్ధారించుకోండి.

**కెఫిన్** : కాఫీ, టీలలో కెఫిన్ ఉంటుంది, ఇది కాల్షియం శోషణను తగ్గిస్తుంది. రోజుకు మూడు కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగడం వల్ల కాల్షియం శోషణకు ఆటంకం కలుగుతుంది. ఎముకలను బలహీనంగా మారుస్తుంది.

**కూల్ డ్రింక్స్** : కూల్ డ్రింక్స్, కోలాలు ఎముకలలోని కాల్షియంను తగ్గించి వాటిని బలహీనపరుస్తాయి.

**కొన్ని కూరగాయలు** : టమాటా, పుట్టగొడుగులు, మిరియాలు, బంగాళాదుంపలు, వంకాయ వంటి తాపజనక కూరగాయలు ఎముకలలో మంటను కలిగిస్తాయి, ఇది బోలు ఎముకల వ్యాధికి దారితీస్తుంది. ఇది పరిమితికి మించి తీసుకోవడం మంచిది కాదు.

# పుదీనా ఆకులు ఎన్ని రకాలుగా ఉపయోగపడుతాయో తెలుసా?



పుదీనా ఆకులు. వీటిని వంటకాల్లో విరి విగా వాడుతుంటాము. ఈ పుదీనా వంట కాల రుచికి మాత్రమే కాదు, మరిన్ని అద్భుతమైన ప్రయోజనాలను కలిగి వుంది. అవేమిటో తెలుసుకుందాము.

పుదీనా పచ్చడి తింటే జీర్ణశక్తి లేనివారికి మంచి శక్తినిస్తుంది.

నీడలో ఆరబెట్టిన పచ్చిపుదినా ఆకులు బాగా ఎండించి మెత్తగా నూరి ఆ చూర్ణానికి నీటిని కలిపి కేశాలు రాలినచోట రాస్తే తిరిగి మొలుస్తుంది.

ఎండిన పుదీనా ఆకులను దుస్తుల మధ్య పెడితే వస్త్రాల మధ్యకి పురుగులు చేరవు.

పుదీనా అకు కషాయంలా కాచి, దానిని గోరువెచ్చటి నీటిలో కలుపుకుని స్నానం చేస్తే చర్మ రోగాలు అదుపులోకి వస్తాయి.

పొట్ట ఉబ్బరం తగ్గేందుకు రెండు చెంచాల పుదీనా ఆకురసంలో చిన్న యాలకుల పొడి మూడు చిటికెలు కలిపి రెండుపూటలా సేవిస్తే సరిపోతుంది.

పుదీనా ఆకులను నలగ్గొట్టి గుడ్డలో చుట్టి వాసన చూస్తుంటే జలుబు తగ్గుతుంది.

నరాల బలహీనతతో బాధపడేవారు పుదీనా తైలాన్ని మర్దనం చేస్తుంటే ఫలితం వుంటుంది.

## పచ్చి మామిడికాయలు ఎందుకు తినాలో తెలుసా?

మామిడి సీజన్ ప్రారంభమైంది. ఇప్పుడు పచ్చి మామిడి కాయలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ఈ మామిడి కాయలు తింటుంటే పలు ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఆ ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము. పచ్చి మామిడి పండ్లలో ఉండే కెరోటినాయిడ్‌లు కంటి చూపును మెరుగుపరచడంలో సహాయ పడతాయి. పచ్చి మామిడిపండ్లు చిగుళ్లలో రక్తస్రావం, స్కర్వీ వంటి వ్యాధులను నియంత్రించడం లో సహాయపడతాయి. పచ్చి మామిడి కాయను మితంగా తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ రుగ్మతలు నయమవుతాయి. పచ్చి మామిడి రోగనిరోధక శక్తిని పెంచుతుంది.



పచ్చి మామిడిని మోతాదుకి మించకుండా తింటే శరీరాన్ని హైడ్రేట్‌గా, చల్లగా ఉంచుతుంది. పచ్చి మామిడి కాలేయం ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది, కాలేయ వ్యాధులకు చికిత్స చేయడానికి సహాయపడుతుంది. చర్మవ్యాధి ఉన్నవారు పచ్చి మామిడి పండ్లను తినేటప్పుడు చర్మంపై చికాకు, దురదను ఎదుర్కొంటారు. పచ్చి మామిడి పండ్లను తినడం వల్ల కొంతమందికి గొంతు నొప్పి వస్తుంది.

# ఖజానా అధికారి సుభాషిణికి సత్కారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా ఖజానాధికారి వి.ఎల్.సుభాషిణి, ఎస్ టి ఓ ఆఫీస్ (వెస్ట్) అనకాపల్లి సీనియర్ అకౌంటెంట్. సలీం సయ్యద్ మరియు జిల్లా ఖజానా కార్యాలయం అనకాపల్లి జూనియర్ అకౌంటెంట్ టి సాయి అఖిలేష్‌లను గణతంత్ర దినోత్సవం సందర్భంగా సర్టిఫికేట్ ఆఫ్ మెరిట్ అవార్డు అందుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం అనకాపల్లి శాఖ వారు సోమవారం సత్కరించి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని కోరుతూ అభినందనలు తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం అనకాపల్లి శాఖ అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు కార్యదర్శి బి ఎల్ ఎన్ శర్మ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ (06073-06074) మధ్య ప్రత్యేక రైళ్లు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రయాణీకుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, దిగువ వివరించిన విధంగా ప్రతి దిశలో 13 ట్రిప్పుల కోసం ప్రత్యేక రైళ్లను రైల్వే నడుపుతుంది.

రైలు నెం. 06073 డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ స్పెషల్ 5 జనవరి-2024 నుండి 29 ఏప్రిల్-2024 (సోమవారాలు) వరకు డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ నుండి 23.45 గంటలకు బయలుదేరుతుంది, ఇది మరుసటి రోజు 11:15 గంటలకు దువ్వాడ చేరుకుని 11.17 గంటలకు బయలుదేరుతుంది. ఇది విజయనగరం 12.15 గంటలకు చేరుకుని 12.25 గంటలకు బయలుదేరి 18.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. (13 పర్యటనలు).

**తిరుగు దిశలో** రైలు నం. 06074 భువనేశ్వర్ - డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ స్పెషల్ 6 జనవరి-2024 నుండి 30 ఏప్రిల్-2024 (మంగళవారం) వరకు 21.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు 01.45 గంటలకు విజయనగరం చేరుకుని 01.55 గంటలకు బయలుదేరుతుంది. ఇది 03:42 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది మరియు 03.44 గంటలకు బయలుదేరి 15.00 గంటలకు డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. (13 పర్యటనలు).

**స్టాపేజ్‌లు:** గూడూరు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట్, దువ్వాడ, విజయనగరం, పలాస, డాక్టర్ ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ మరియు భువనేశ్వర్ మధ్య ఖుర్దా రోడ్డు.

**కూర్పు:** 2- 2వ ఏసీ కోచ్‌లు, 2- 3వ ఏసీ కోచ్‌లు, 12- స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 2- జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు & 2- సెకండ్ క్లాస్ కమ్ లగేజ్/ దివ్యాంగజన్ ఫ్రెండ్లీ.

ఈ ప్రత్యేక రైళ్ల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## అప్పుడు చిరంజీవి, ఇప్పుడు పవన్ ఇద్దరూ రాష్ట్రానికి అన్యాయం చేశారు: మంత్రి చెల్లుబోయిన

మెగాస్టార్ చిరంజీవి, జనసేనాని పవన్ కల్యాణ్‌లపై ఏపీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో ప్రజారాజ్యం పార్టీ పెట్టిన చిరంజీవి ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరి రాష్ట్రానికి అన్యాయం చేశారని విమర్శించారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబు పంచన చేరారని దుయ్యబట్టారు. చిరంజీవి చేసిన అన్యాయాన్ని సరిదిద్దుకునేందుకే జనసేన పార్టీని పవన్ పెట్టారని తాము భావించామని అయితే, చంద్రబాబు కోసం ఆయన పార్టీ పెట్టారనే విషయం బయటపడిందని చెప్పారు. ఎన్టీఆర్ కుటుంబానికి అన్యాయం చేసిన చంద్రబాబుతో పవన్ అంటకాగుతున్నారని విమర్శించారు. పవన్ ఒక నిస్సహాయ రాజకీయ నాయకుడని ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉన్న జగన్ ను ఓడిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. నారా లోకేశ్ అవినీతిపరుడని గతంలో విమర్శించిన పవన్ ఇప్పుడు వారితోనే కలవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని అందించడంలో జగన్ చరిత్ర సృష్టించారని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఎంత మంది కలిసొచ్చినా జగన్ ను ఓడించడం సాధ్యం కాదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# అంగరంగ వైభవంగా జనసేన నగర అధ్యక్షులు వంశీకృష్ణ యాదవ్ జన్మదినోత్సవ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ యాదవ్ జన్మదినోత్సవం పురస్కరించుకొని శివాజీపాలెం క్యాంప్ కార్యాలయంలో జన్మదిన వేడుకలును జనసేన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఉదయం శివాజీపాలెం సాయిబాబా గుడిలో వంశీకృష్ణ యాదవ్ శిరిడి సాయిబాబా వారిని దర్శనం చేసుకున్న అనంతరం శివాజీ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. అనంతరం అభిమానులు, జనసేన యువత, వివిధ జిల్లాల నుంచి వివిధ నియోజకవర్గాల నుంచి, వివిధ వార్డుల నుంచి, అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గజమాలతో, పూల బొకేలతో, వివిధ సేవా కార్యక్రమాలతో వంశీకృష్ణ జన్మదిన వేడుకలను ఎన్నడూ లేని విధంగా అభిమానులు జరిపారు. కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతో విలువైన, ప్రేమాభిమానాలు కురిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, వివిధ నియోజకవర్గాల ఇన్చార్జులు, పలు వార్డు నుంచి పెద్ద ఎత్తున వచ్చిన గ్రామ అధ్యక్షులు, గ్రామ కమిటీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు, పార్టీలకతీతంగా పెద్ద సంఖ్యలో అభిమానులు వంశీకి శుభాకాంక్షలు తెలిపారు.

# బాలికలను చదివించి 18సం॥లు నిండాకే పెళ్లి చేయాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** బాలికలను బాలురులతో సమానంగా చదివించి వారికి 18సం॥లు పెళ్లి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన "బాల్యవివాహాల నిషేధం", "బేటి పడావో బేటి బచావో" పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు విద్యాభివృద్ధికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. ఎక్కడైనా పాలు వివాహాలు జరిగుతున్నట్లయితే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ విషయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆడపిల్లల విషయంలో సమాజం దృక్పథాన్ని మార్చే విధంగా పోస్టర్ల ద్వారా అందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు నిర్వహించిన వారికి వారిని ప్రోత్సహించిన వారికి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈవిషయమై జిల్లాలోని పాఠశాలలు కేజీబీవీ లలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్ఓ బి.దయానిధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట మహా లక్ష్మమ్మ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ.హేమంత్, డ్వామా పిడి ఈ.సందీప్, డిఆర్ డిఎ పి.డి. శచీదేవి పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగంలో పథకాలు ఏకరువు : కొణతాల వెంకటరావు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వైసిపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థను సమూలంగా నాశనం చేసిందని, గవర్నర్ ప్రసంగంలో వ్యవసాయం అనుబంధ రంగాలపై ముందుగా ప్రస్తావిస్తారని, కానీ వైసీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని ఎన్నుకుం దని, ఆంగ్ల మాధ్యమం, బైజుస్, టోఫెల్ వంటి వాటిని కీర్తించి విద్య కార్పొరేటీకరణకు బాటలు వేసామని గొప్పలు చెప్పుకుందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు జగన్ రెడ్డి ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. అవినీతి అక్రమాలపై సమాధానం లేదని, ఇటీవలే కేంద్రం విడుదల చేసిన ఒక సర్వేలో ప్రాథమిక, సెకండరీ స్థాయిలో డ్రాప్ అవుట్‌లో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి అధమంగా ఉందని చెప్పకనే చెప్పిందని, దాదాపు 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్ సాక్షిగా వెల్లడి కాగా ఎన్నికలకు ముందు ఇచ్చిన మెగా డీఎస్సీ హామీని తుంగలో తొక్కి మాట తప్పిందని, ఎన్నికల సమీపిస్తున్న వేళ 6 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని, అది కూడా ఏప్రెంటిస్ విధానంలో ఉంటుందని, వాస్తవాలను కావాలనే ప్రభుత్వం దాచి పెట్టిందని వెంకటరావు మండిపడ్డారు. ఆర్ బి కే లు, రైతు భరోసా అన్నదాతలను ఆదుకున్నట్టు ప్రభుత్వం అసత్యాలు గవర్నర్ చేత చెప్పించారని, వైద్య రంగాన్ని తీసుకుంటే ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయనందున నెట్ వర్క్ ఆసుపత్రులు తరచూ చికిత్సలను తిరస్కరిస్తున్నారని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుకు నిదర్శనం కరోనా సమయములో ఆక్సిజన్ అందక రోగులు మరణించిన దృశ్యాలు సజీవ సత్యాలుగా నిలుస్తాయని, విశాఖ అనకాపల్లి జిల్లాలో సాగునీరు ప్రాజెక్టులు నిర్వహణకు నిధులు లేక ప్రాజెక్టులో నీరు లేక రైతులు వేలవేల బోయరని, ఇక జగన్ రెడ్డి మహిళా సాధికారత, సామాజిక న్యాయం వంటి పెద్ద పెద్ద మాటలు చెప్పడం, స్త్రీ శిశు సంక్షేమం కోసం పాటుపడుతున్న అంగన్వాడీలు, పారిశుధ్య కార్మికులు పట్ల వైసిపి ప్రభుత్వం అనుసరించిన ఎస్మా ప్రయోగం వంటి ప్రభుత్వ నైజాన్ని బయటపడిందని వెంకటరావు అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అభివృద్ధి, విశాఖ రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వంటి గవర్నర్ ప్రసంగంలో టార్చ్ లైట్ వేసి చూసిన ఎక్కడా కనపడలేదని వెంకటరావు ఎద్దేవా చేశారు. ఇక అప్పులు పది లక్షల కోట్లు పైనే మితిమీరాయని, ఇసుక,లిక్కర్, భూ దోపిడి అక్రమాలపై ఆరోపణ వెలువెత్తిన అభివృద్ధి లేకపోయినా గుంతల రోడ్లు ఎక్కడికక్కడ కనబడుతున్న రెండంకెల వృద్ధి అనడం జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెల్లిందని, తమకు ప్రజల నుంచి సహకారం గట్టి మద్దతు ఉందని చెప్పడం అత్యాశకు పరాకాష్ట వంటిదని వెంకటరావు ఘాటుగా విమర్శించారు. విలేకరుల సమావేశంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు, చదరం శివ, అప్పారావు, కాయల ప్రసన్నలక్ష్మి, వేదుల సూర్యప్రభ, కోట్ని ఉమా, కూరాకుల భారతి, తదితరులు పాల్గొన్నారు.

# 2024 ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** 2024 లో అరకు అసెంబ్లీ మరియు పార్లమెంట్‌లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పని చెయ్యాలని బీజేపీ మాజీ ఏం.ఎల్.సి పీ.వీ.ఎన్ మాధవ్ అన్నారు. సోమవారం హుకుంపేట మండలంలో నిర్వహించిన అరకు అసెంబ్లీ క్లస్టర్ సమావేశంలో ముఖ్య అతిథిగా అయన పాల్గొన్నారు. బీజేపీ అరకు అసెంబ్లీ బి.సాయి ధర్మరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. టీడీపీ వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతంలో జరిగిన అభివృద్ధి ఏమి లేదన్నారు. అప్పుడు, ఇప్పుడు బీజేపీ కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులతోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి జరిగిందనీ అన్నారు. ఓటమి భయం తోనే వైసీపీ పార్టీ అభ్యర్థులను మార్చిందన్నారు. దీని వల్లే వైసీపీ ఓటమిని ఒప్పు కున్నట్లయిందన్నారు. కాబట్టి అరకు అసెంబ్లీ ప్రజలందరూ బీజేపీ వైపే మొగ్గు చూపిస్తున్నారని పేర్కొన్నారు. అరకు యువత ప్రజలు అందరూ బీజేపీకి మద్దత్తుగా ఉన్నారని అన్నారు. కేంద్రంలో మరోసారి, ఆంధ్ర లో ఒక్క సారి బీజేపీని గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. ఈ సందర్భంగా ముంచంగి పుట్టు, డుంబ్రి గూడా మండలాలకు చెందిన పలువురు బీజేపీ పార్టీ లోకి చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పాంగి రాజారావు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కురుసా ఉమా మహేశ్వర రావు, అరకు పార్లమెంట్ కన్వీనర్ బీ. వీ భారతి, అరకు పార్లమెంట్ లబ్దిదారుల కమిటీ కన్వీనర్ డా॥ హేమానాయిక్, గిరిజన మోర్చా మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కురుసా పార్వతమ్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మతం శాంత కుమారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు, బీజేపీ జిల్లా కార్యదర్శి చిన్నతల్లి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు తాంగుల సత్యవతి,గిరిజన మోర్చా సోషల్ మీడియా కో కన్వీనర్ నందోలి శివ కృష్ణ, పలు మండలాల అధ్యక్షులు, జిల్లా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## రాహుల్ 'బిస్కెట్' తినడానికి నిరాకరించి కాంగ్రెస్‌కు రాజీనామా చేశా : అసోం సీఎం తీవ్ర వ్యాఖ్యలు



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభమైనప్పటి నుంచీ అయనపై విరుచుకు పడుతున్న అసోం ముఖ్య మంత్రి హిమంత బిశ్వశర్మ తాజాగా మరోమారు విమర్శనా స్త్రాలు సంధించారు. ఓ కార్యకర్తకు రాహుల్ కుక్క బిస్కెట్ ఇచ్చారంటూ మండిపడ్డారు. కుక్కపిల్లకు రాహుల్ గాంధీ బిస్కెట్ తినిపిస్తున్న వీడియో ఒకటి వైరల్ అయింది.

ఈ వీడియోను భారత్ జోడో న్యాయ్ యాత్ర తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది. ఝార్ఖండ్ పర్యటనలో రాహుల్ ఓ బిస్కెట్ ప్యాకెట్ అడగడం, ఓ బిస్కెట్‌ను కుక్కపిల్లకు ఇవ్వడం కనిపించింది. ఆ తర్వాత రాహుల్‌తో సెల్ఫీ తీసుకునేందుకు కార్యకర్తలు పోటెత్తారు. అయితే, ఆ వీడియోలో కార్యకర్తకు బిస్కెట్ ఇస్తున్నట్టుగా మాత్రం ఎక్కడా కనిపించలేదు.

అసోం సీఎం పోస్టు చేసిన వీడియోలో కార్యకర్తకు రాహుల్ గాంధీ బిస్కెట్ ఇస్తున్నట్టుగా ఉంది. ఈ వీడియోపై బీజేపీ తీవ్రంగా విరుచుకుపడింది. రాహుల్ తన మద్దతుదారులకు కుక్క బిస్కెట్లు ఇస్తున్నారంటూ విమర్శలు ప్రారంభించింది.

ఒకప్పుడు కాంగ్రెస్ నేత అయిన హిమంత గతంలో రాహుల్ గాంధీ తన పెంపుడు కుక్కకు తినిపించిన ప్లేట్ లోని బిస్కెట్లను తనతో పాటు మిగతా నేతలకు ఆఫర్ చేశారని చెప్పారు. రాహుల్, ఆయన కుటుంబ సభ్యులు తనతో మాత్రం బిస్కెట్ తినిపించలేకపోయారని అన్నారు. బిస్కెట్ తినడానికి తిరస్కరించి పార్టీకి రాజీనామా చేశానని, తాను అస్సామీ, భారతీయుడినైనందుకు గర్వపడుతున్నట్టు చెప్పారు.

# శాసనసభ టికెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రియాంక దండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శాసనసభ టికెట్ కోసం విజయవాడ ఆంధ్ర రత్న భవన్‌లో పార్టీ రిటర్నింగ్ అధికారిణి వద్ద దరఖాస్తు చేసుకున్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధిష్టానం నన్ను గుర్తించి టికెట్ ఇస్తే, తూర్పు నియోజకవర్గ ప్రజలు నన్ను శాసనసభ్యురాలిగా గెలిపిస్తే రాబోవు 5 సంవత్సరాలలో యువతకు స్టార్టప్ కేంద్రం ఏర్పాటు చేసి వందల మంది యువతను వ్యాపారావేత్తలుగా తీర్చి దిద్దుతానని, ప్రతి మహిళలకు ఉపాధి అవకాశాలు కలిపించే ప్రణాళిక రూపొందిస్తానని, కుట్టు పరిశ్రమలు, చేతి వృతి పనులు ఏర్పాటు ఏర్పాటు చేస్తానని ఆమె అన్నారు, వెంకోజీపాలెం, హనుమంతవాక కొండవాలు ప్రాంత ప్రజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తానని, వర్షం వస్తే ములిగిపోతున్న ఎంవీపీ కాలనీకి సాంకేతిక ఏర్పాట్లతో నీళ్లు నిలవకుండా ఏర్పాట్లు చేస్తానని, దశాబ్దాలుగా నలుగుతున్న కైలాసగిరి పక్కన ఉన్న వెంకోజిపాలెం సమస్యకు పరిష్కారం చూస్తానని, ఆరిలోవలో ఉన్న మౌలిక సమస్యలతో పాటు, మాదక ద్రవ్యలు, రౌడీజం వంటి సమస్యల పై పోరాడతానని, ఆరిలోవ పంతంలో సింహాచల దేవస్థానంతో ఉన్న భూ వివాదాలు పరిష్కరించే ప్రయత్నం చేస్తానని, జోడుగుల పాలెం, వాటైర్ మత్స్యకార యువతకు ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నం చేస్తానని, విశాలాక్షి నగర్ రైతు బజార్ పూర్తి వినియోగంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తానని,ప్రజా సమస్యల ఫిర్యాదులకు ఒక యాప్ రూపొందించి దాంట్లో వచ్చిన ఫిర్యాదులకు ఏంఎల్ఎ కార్యక్రమం సిబ్బంది సమస్య పరిష్కరానికి కృషి చేస్తారని, ఎవరు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పని లేదని, నియోజకవర్గ పరిధిలో ఉన్న యాదవ్, గవర, కాపు, ముస్లిమ్, క్రిస్టియన్, బ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణ, మత్స్యకార, కమ్మ, క్షత్రియ, మాల, మాదిగ మరియు ఇతర సామాజిక వర్గాల పెద్దలతో కమిటీలు వేసి 5 సంవత్సరాలలో వారి సమస్యల పరిష్కరిస్తాను అని ప్రియాంక హామీ ఇచ్చారు.

# పాడేరు ఘాటీలో ఆర్టీసీ బస్సు రోడ్డు ప్రమాద బాధితులకు నేటికీ పరిహారం ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** పాడేరు ఘాటిలో ఆర్టీసీ బస్సు బోల్తా పడి కొంతమందికి ఎముకలు విరిగి, మరి కొంతమంది స్వల్ప గాయాలు పాలైన బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ గత సంవత్సరము 2023 ఆగస్టు 20వ తేదీన విశాఖపట్నం వైపు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు పాడేరు ఘాటిలో బోల్తా పడి ఇద్దరు వ్యక్తులు చనిపోగా, మరి కొంతమందికి ఎముకలు విరిగిపోయి, మరి కొద్ది మంది స్వల్ప గాయాలు పాలైన పరిస్థితి ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చనిపోయిన ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షల రూపాయలు నష్టపరి హారం. ఎముకలు విరిగిపోయిన ఒక్కొక్క బాధితులకు 5 లక్షల రూపాయలు స్వల్ప గాయాలు అయిన ఒక్కొక్కరికి 1 లక్ష రూపాయలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. ప్రమాదం జరిగిన వెంటనే రాష్ట్ర మంత్రి మరియు జిల్లా అధికారులు ఘటన స్థలానికి చేరుకొని బాధితులందరికీ మెరుగైన చికిత్స ప్రమాదంలో గాయపడిన వారికి నష్ట పరిహారం ఇస్తామని ప్రకటించారు కానీ నేటిక ఐదు నెలలు గడుస్తున్న ప్రమాదా బాధితులకు పరిహారం అందించకపోవడం చాలా దుర్మార్గమని వారు అన్నారు. ప్రమాద బాధితులు జిల్లా అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం శూన్యంగా కనిపిస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన రెండు కుటుంబాలకి మాత్రమే పరిహారం అందింది. మిగతా బాధితులకు ఎముకలు విరిగి స్వల్పగల గాయాలు పాలైన వారికి ఇప్పటివరకు ఎటువంటి పరిహారం అందించకపోవడం ఇంతకన్నా దుర్మార్గమైన పరిస్థితి ఇంకేమీ లేదని తక్షణమే రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందించాలని లేనిపక్షంలో రోడ్డు ప్రమాద బాధితులతో ఆందోళన చేయడానికి కూడా వెనకాడబోమని వారన్నారు ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధితులు. కుంబిడి సుబ్బలక్ష్మణరావు, బోయిన నాగేశ్వరరావు ,కిలో బోడరాజు, కుర్ర బుంజు బాబు, వంతల కోటి బాబు, పాంగి సింహాద్రి, పర్లాబు ప్రభ, గేమేలి నాగేష్ ,తాంగుల జ్యోతి. తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ నిర్ణయమే శిరోధార్యం : బోడపాటి శివదత్



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్): పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలో జనసేన పార్టీ కార్యాలయం నందు విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బోడపాటి శివదత్ మాట్లాడుతూ మా సుప్రీమ్ కే.పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేస్తానని పార్టీ నిర్ణయం నాకు శిరోధార్యం అని అన్నారు. విలేకరులడిగిన ప్రశ్నలకు చక్కని సమాధానాలు ఇచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గంలో మీకు అవకాశం ఉంది కదా, పోటీ చేయవచ్చు కదా, ఇపుడు టీడీపీ జనసేనకు ప్రజలు మద్దత్తు కూడా ఉంది కదా, అని అనుకున్న సమయంలో అడగగానే ఆయన టీడీపీ జనసేన నిర్ణయం చేసిన సీట్లలో మాత్రమే ఉంటుంది. పొత్తులో భాగంగా ఎలా ఉంటుందో చూడాలన్నారు. పార్టీ నాకూ ఇపుడు సముచిత స్థానంలో ఉంచింది. నా సేవలు గౌరవ పవన్ కళ్యాణ్ గుర్తించేలా పార్టీకు కట్టుబడి పనిచేస్తానని చెప్పారు. కేడర్‌ను అంతా కలుపుకొని మా నాయకులను ఉన్నత స్థానంలో ఉంచడమే మా లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా నక్కపల్లి మండలం ప్రింట్ మీడియా అధ్యక్షులు ఆచంట రామకృష్ణ, జ్యోతి, రాంబాబు, కృష్ణ, మురళి, రాజు, శ్రీను, కృష్ణ, వెంకటేష్, సాక్షి గణేష్, బీవీవి సత్యనారాయణ, రాజు తదితర సభ్యులు పాల్గొన్నారు. జనసేన మండలం జిల్లా కార్యదర్శి నాయకులు ఆకేటి గోవిందరావు, ప్రేమసాయి స్కూల్ కరెస్పాండెంట్, జిల్లా జాయింట్ సెక్రటరీ కురందాసు అప్పలరాజు, పాము గణేష్, చంద్రరావు రాజు, పీక్కి స్వామి, జనసైనికులు వై.చిన్న, బి. గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీనివాస్



కాకినాడ, (విశాఖ సమాచారమ్): కాకినాడ ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు ఈ నెల 6నుండి 8వరకు జరగనున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనేందుకు గోవాకు బయల్దేరి వెళ్ళారు. ఈ సందర్భంగా లయన్స్ ఎలైట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట్ నగర్‌లోని మార్‌టెక్ ప్రధాన కార్యాలయంలో లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీనివాసరావు అభినందన కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షులు ఎం. సుబ్రహ్మణ్యం నిర్వహించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడానికి లయన్స్ ఎలైట్ క్లబ్ ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు. త్వరలో కాకినాడకు చెందిన జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించామని చెప్పారు. కాకినాడ పేరును జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిలబెడుతున్న వెయిట్ లిఫ్టర్ శ్రీనివాసరావును అభినందిస్తూ స్వయం కృషితో రాణించడం ఆయన క్రమశిక్షణకు నిదర్శనమని అన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తన గోవా పర్యటన విజయవంతం అవ్వాలన్న ఆకాంక్షతో లయన్స్ సత్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. ఇప్పటి వరకు తాను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో 62 బంగారు పతకాలను సాధించానని చెప్పారు. గోవాలో జరిగే జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో కూడా తప్పక విజయం సాధిస్తాని తెలుపుతూ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో గణేష్, సాగర్, రంగాభట్ల శ్రీనివాస్, పరశురామ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఎన్ఏడి ఫ్లైఓవర్ మీద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఎన్ఏడి ఫ్లై ఓవర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వివిధ దళిత సంఘాల ప్రతినిధులు మంగళవారం జీవీఎంసీ కమిషనర్, మేయర్‌లను కలిసి వినతి పత్రం ఇవ్వాలని వచ్చారు. ఎవరూ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ మేయర్‌లు జిఎస్. శ్రీధర్, సతీష్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జే.వి.ప్రభాకర్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఎన్ఏడి కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ఫ్లైఓవర్ మధ్యలో ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేశామని, మంత్రుల దృష్టికి కూడా తీసుకువెళ్లాము అన్నారు. జీవిఎంసి కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశారని తెలిపారు. తాము ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విగ్రహాన్ని తొలగిస్తే దళిత బహుజన మనోభావాలు దెబ్బతింటాయని , దళితులందరి కోరిక అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు, కొత్తపల్లి వెంకటరమణ, చిరంజీవి, రాంబాబు డిహెచ్ పీఎస్, భీమ్ సేన వార్ ప్రతినిధులు వేమన, రాజేంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా షిప్‌యార్డ్ పెన్షనర్ల ధర్నా




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): కేంద్రప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు ఆల్ పెన్షనర్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (అప్రా) జిల్లా కమిటీ ఆధ్వర్యములో ఆర్అండ్‌బి పిఎఫ్ ఆఫీసు వద్ద ధర్నా జరిగింది. హిందుస్థాన్ షిప్ యార్డు పెన్షనర్స్ పాల్గొన్న ధర్నాలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె హుస్సేన్, ఏపీ ఆర్ పి ఏ సీనియర్ నాయకులు యు వి ఎస్ ఎన్ వర్మ మాట్లాడుతూ 2008 నుండి ప్రతి సంవత్సరము ఢిల్లీలో ధర్నాలు చేసి వినతి పత్రాలు అందించి, పార్లమెంటులో వామపక్ష ఎంపీలు ప్రశ్నిస్తున్నప్పటికీ కేంద్ర బిజెపి ప్రభుత్వంలో చలనము లేదన్నారు. ఈపీఎఫ్ 95 పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నప్పటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కన్నెత్తి చూడటం లేదని తెలిపారు. కనీసం ఆరోగ్యశ్రీ ద్వారానైనా వైద్య సదుపాయము కల్పించటలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నప్పటికీ ఏపీ ఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ 9000 రూపాయలు ఉండాలని, దానిపై డిఏ నిర్ణయించి అమలు చేయాలని దేశవ్యాప్తంగా పెన్షనర్లు పోరాడుతున్నప్పటికీ మోడీ ప్రభుత్వం పెడచెవిన పెడుతుందన్నారు. రాష్ట్రంలో సామాన్యులకి అమలు చేసే సంక్షేమ పథకాలను షిప్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైయర్పెనెన్ ఆప్షన్ అందరికి కల్పించాలని, రైల్వేలో గతంలో మాదిరిగా 50 శాతం ప్రయాణంలో రాయితీని పునరిద్ధరించాలని, అలాగే షిప్ యార్డ్ ఉద్యోగులకు రావలసిన పిఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించి కోర్టులో ఉన్న కేసులను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఆర్.బాబూరావు, బిటి మూర్తి, అప్పల రాజు, టి.భాస్కర్, కె.పి.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులలో భయాందోళనలు కలిగిస్తున్న యాజమాన్య చర్యలను తక్షణం ఆపాలి




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): స్టీల్ యాజమాన్యం సృష్టిస్తున్న కార్మికులలో భయాందోళనలను తక్షణం ఆపాలి అని స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నేడు స్టీల్ సిఐటియు మరియు మిత్రపక్షాల ఆధ్వర్యంలో ప్లాంట్‌లోని ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం సిజియం (వర్క్స్) సోప్తి గారికి వినతి పత్రం అందజేశారు.

ఈ ధర్నానుద్దేశించి వైటి దాస్ మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం రోజుకొక సర్క్యులర్ ద్వారా కార్మికులలో భయాందోళన సృష్టిస్తూ స్టీల్ ఉత్పత్తికి అంతరాయం కలిగించే విధంగా చర్యలు చేపడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్మిక సమస్యలను పక్కదోవ పట్టించే విధంగా నేడు బయోమెట్రిక్ విధానంతో కార్మికులను గందరగోళంలోకి నెడుతోందని దీనిని తక్షణం విరమించుకుని కార్మిక సమస్యలపై చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టీల్ సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరాజు, అదనపు ప్రధాన కార్యదర్శి బి.అప్పారావు, మిత్రపక్షాల నాయకులు డివి రమణ రెడ్డి, సిహెచ్ సన్యాసిరావు, కర్ర ప్రకాష్ మాట్లాడుతూ ప్లాంట్ లో స్టీల్ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను వారి తీవ్రంగా విమర్శించారు. స్టీల్ యాజమాన్యం కార్మికులను గందరగోళానికి గురి చేస్తుంటే గుర్తింపు యూనియన్ వాటికి ఆజ్యం పోస్తున్నట్టుగా ప్రకటనలు చేయడం తీవ్ర అభ్యంతరాన్ని కలిగిస్తోందని వారు అన్నారు. గుర్తింపు యూనియన్ స్పష్టమైన వైఖరితో యాజమాన్యంపై పోరాటానికి పిలుపునిస్తే వారి వెనుక పోరాటానికి సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు. యాజమాన్యం ఇదే వైఖరిని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని వారు హెచ్చరించారు.

దీనిపై స్పందించి సోప్తి మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నత యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఈ ధర్నాలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు కృష్ణమూర్తి, మహేష్, శ్రీనివాస్, బాలశౌరి, మొహిద్దిన్, పూర్ణచంద్రరావు తదితరులతోపాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు మరియు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## కొత్తవలస నుండి జయంతి వలస రోడ్డు తక్షణమే నిర్మించాలి



అరకులోయ, (విశాఖ సమాచారమ్): అరకువాలీ మండలం బొండం పంచాయతీ జయంతి వలస నుండి కొత్తవలస వరకు 2019 సంవత్సరంలో MGNREGS గ్రాంట్ క్రింద 80లక్షలుతో బిటి రోడ్డు మంజూరు అయ్యింది.

దీనికి గ్రావెల్ పనులు కొంత వరకు చేసారు. మిగిలిన దాంట్లో మట్టి పనులు కూడ పూర్తి చేయలేదు. గ్రావెల్ వేయడానికి మెటీరియల్ వేసి నెలలు కావస్తున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు బిల్లులు అవ్వడం లేదు అనే సాకు చూపుతూ పనులు పూర్తి చేయక, కాంట్రాక్టరు 2019 నుండి 2024 సంవత్సరం వరకు కాలక్షేపం చేస్తూ వస్తున్నారు. మొన్న డిసెంబర్‌లో వచ్చిన మిచాంగ్ తుపాన్ దాటికి రోడ్డులో వేసిన గ్రావెల్ కొన్ని చోట్ల పూర్తిగా కోతకు గురైయింది. దీనివలన వాహనాలు నడవడానికి అవకాశం లేకుండా పోయింది. చుట్టు పక్కల గ్రామాలకు ప్రజాలు పండించే దినుసులు మార్కెట్‌కు తీసుకొని వెళ్లి అమ్ముకోవాలి అన్నా, వారానికి సరిపడ్డ నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి వారపు సంతకు వెళ్ళాలి అన్నా రోడ్డు సదుపాయం లేనందున తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గర్భిణీ స్త్రీలు కిలో మీటర్ దూరం నడిచి వెళ్ళి వాహనం ఎక్కుతున్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు ప్రైవేట్ వాహనాల ఆశ్రయిస్తే గ్రామానికి రావడానికి రోడ్డు బాగులేదు అని చెప్పి బుకింగ్ చేస్తే తప్ప రావట్లేదు. దీని వలన ప్రజాలకు అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆర్థిక ఇబ్బదులకు గురవుతున్నారు. ఈ రోడ్డు విషయం పై గతంలో పాడేరు స్పందన కార్యక్రమంలో కలిసి పిర్యాదు చేసినా ఎటువంటి స్పందనా లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని తక్షణమే స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసి గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము, లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అన్ని గ్రామల ప్రజాలను కలుపుకొని ఎంపీడీఓ ఆఫీస్‌లో ఆందోళన చేస్తాము అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు జి. బుజ్జి బాబు, ఆదివాసీ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు టి. జోషి, పంచాయతీ నాయకులు జి. సత్యరావు, జి. రామన్న, జి. వెంటట్, టి. కృష్ణ పాల్గొన్నారు.

## పేట టిక్కెట్ జనసేనకు కేటాయించాలి : జనసైనికులు



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్): పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం జనసేనకుల సమక్షంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగింది అనకాపల్లి జనసేన పార్టీ జిల్లా సెక్రెటరీ ఆకేటిగోవిందరావు జనసేనపార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కురందాసు అప్పలరాజు ఎస్ రాయవరం ముఖ్య నాయకులు బాబురావు మాస్టర్ ప్రెస్‌తో మాట్లాడుతూ జనసేన పార్టీ తెలుగుదేశం పొత్తులో భాగంగా గత కొన్ని సంవత్సరాలగా పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ కోసం సేవా కార్యక్రమాలతో పాటు యువతకు అండగా నిలిచినటువంటి జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌కి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి ముఖ్య నాయకులు అందరూ మాట్లాడుతూ సీటు కేటాయించాలని మీడియా సమక్షంలో తెలియజేయడం జరిగింది. పవన్ కళ్యాణ్ గారి సిద్ధాంతాలను పాటిస్తూ అటు పార్టీకి ఇటు నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందించినటువంటి బోడపాటి శివదత్‌కి సీటు కేటాయిస్తే వైసిపి పార్టీని ఓడిస్తామని జనసైనికులు అందరూ పెద్దఎత్తున నియోజవర్గంలో తెలియజేస్తున్నారు. దీనిని గమనించి పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడు పొత్తులో భాగంగా సీట్లు కేటాయిస్తున్న తరుణంలో పాయకరావుపేట సీటు శివదత్‌కు కేటాయించాలని కోరుతూ అలాగే పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ అనితకు సీటు ఇచ్చినా మేము పవన్ కళ్యాణ్ మాట గౌరవించి గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని మీడియా సమక్షంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాము గణేష్, ఎలమంచిలి చంద్రరావు,పిక్కి స్వామి, పిక్కి గోవిందు చిన్న, కురందాసు రమణ, పొన్నాడ భూలోక, పిక్కి తాతజి, మంగబాబు, రమణ, బంగారాజు రాజు, తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## పాదయాత్రలో ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చిన నాయకుడు జగన్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మాట తప్పని మడం తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని వైకాపా అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త అన్నారు. మండలంలోని కశింకోట గ్రామంలో ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు అధ్యక్షతన "వైయస్సార్ ఆసరా" కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా అనకాపల్లి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. భరత్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నూటికి నూరు శాతం అమలు చేశారని, డ్వాక్రా అక్కచెల్లెళ్లకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. దిలీప్ కుమార్ మాట్లాడుతూ మంత్రి అమర్నాథ్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేసినన్ని సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని, ముఖ్యమంత్రి పీఠాన్ని జగన్ అధిష్టించడం తథ్యం అని అన్నారు.

జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లి బాబు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, జిల్లా మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్, వైకాపా గ్రీవెన్స్ సెల్ చైర్మన్ డాక్టర్ కె. విష్ణుమూర్తి, జిల్లా యువజన నాయకులు మలసాల కుమార్ రాజా, గ్రామ సర్పంచ్ రజిని, డ్వాక్రా సంఘాల సభ్యులు మరియు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, భారీ ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ప్రజల ఆహ్లాదం కొరకు పార్కుల అభివృద్ధి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ప్రజలకు ఆహ్లాదం తోపాటు సేద తీరేందుకు పార్కుల నిర్మాణం అవసరమని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆయన రెండవ జోన్ మధురవాడ పరిధిలోని బక్కన్నపాలెం లచ్చిరాజు లేఔట్‌లో నిర్మిస్తున్న స్పోర్ట్స్ పార్క్‌ను, ఎం.ఎస్.ఆర్ లేఔట్‌లో జీవీఎంసీ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ లచ్చిరాజు లేఔట్‌లోని స్పోర్ట్స్ పార్క్ దాదాపు 80 శాతం పనులు పూర్తయిందని మిగిలిన పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని, పార్కులో పచ్చదనం, పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఎం.ఎస్.ఆర్ లేఔట్ లోని జీవీఎంసీ పార్కు ఆకర్షనీయమైన మొక్కలు, వాకింగ్ ట్రాక్ మరమత్తులతో పాటు పార్కు నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీరు శ్యాంసన్ రాజు, ఎడిహెచ్ చక్రవర్తి, జోనల్ కమిషనర్ డి.లక్ష్మి, కార్యనిర్వా హక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాకి ఇంజనీర్లు, శానిటరీ సూపర్ వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ




అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించవలసిందిగా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయవలసిందిగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. "స్పందన" ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులకు ఎస్పీ సూచించారు.

పోలీసు స్పందన కార్యక్రమానికి 34 ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు మరియు చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక "స్పందన" కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఫిర్యాదు దారులు సమస్యలను ఎస్పీ ముందు స్వేచ్ఛగా విన్నవించుకోగా, ఎస్పీ మురళీకృష్ణ సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ.సత్యనారాయణ రావు, ఎస్పై కె.సావిత్రి పాల్గొన్నారు.

# 25వేల ఖాళీ ఉపాధ్యయ పోస్టులు భర్తీ చేస్తూ మెగా డిఎస్సి ప్రకటించాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మెగా డిఎస్సీ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వాగ్దానాన్ని అమలు చేస్తారని ఎదురు చూసిన వారికి తాజా ప్రకటన నిరాశపరిచింది. వెంటనే మెగా డిఎస్సీ నిర్వహించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమే. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, విద్యా అనుబంధ రంగాల పోస్టులన్నీ భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

ప్రతిపక్షనేతగా జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా వైసిపి అధికారంలోకి వస్తే మెగా డిఎస్సీ ప్రకటించి నిరుద్యోగులకు కానుకగా ఇస్తామని ప్రకటించారు. నిరుద్యోగ యువత ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. కానీ రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేని విధంగా ఈ ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క డిఎస్సీ కూడా ప్రకటించకపోవడం అన్యాయం. సుదీర్ఘకాలంగా యువజన సంఘాలు, నిరుద్యోగ యువత పోరాడిన ఫలితంగా కంటి తుడుపు చర్యగా 6,100 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. ఇవి కూడా అన్ని జిల్లాలు, కేటగిరీలను సమగ్రంగా రూపొందించలేదు.

డిఎస్సీ ప్రకటించిన వాటిలో కూడా అనేక నిబంధనలు పెట్టారు. ఎప్పుడో రద్దు చేసిన అప్రెంటిస్ విధానాన్ని పున:ప్రవేశపెట్టి రెండేళ్ళు గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించడం దుర్మార్గం. గడిచిన నాలుగు ఏళ్ళుగా కొత్తగా ఉద్యోగాలకోసం రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది అభ్యర్థులు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి కోచింగ్‌లు తీసుకొని నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. కానీ ప్రభుత్వం ప్రకటించిన సంఖ్యను చూసి లక్షలాది మంది యువత నిరుత్సాహం చెందుతున్నారు. రాష్ట్రంలో వివిధ రకాల ఉపాధ్యాయ పోస్టులు సుమారు 25 వేలు ఉన్నాయి. ఇవిగాక రానున్న జూన్‌లో మరిన్ని పోస్టులు ఖాళీ అవుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని మెగా డిఎస్సీ ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

# పబ్లిక్ లైబ్రరీలో నేడు "మూడుదారులు" పుస్తక పరిచయం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ రచించిన "మూడు దారులు" పుస్తక పరిచయ సభ పబ్లిక్ లైబ్రరీ, ద్వారకానగర్, విశాఖలో ఫిబ్రవరి 7వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారు. (ఈ పుస్తకం ఆవిష్కరణ సభ విజయవాడలో జనవరి 27వ తేదీన నిర్వహించారు). న్యూఢిల్లీ లోని ప్రతిష్టాత్మక రూపా పబ్లికేషన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఇదే పుస్తకాన్ని అమర్ ఇంగ్లీషులో (The Deccan Powerplay) కూడా రచించారు. ఇంగ్లీషు పుస్తకం న్యూఢిల్లీ లో జనవరి 16న ఆవిష్కరించారు. విశాఖలో పుస్తక పరిచయ సభకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్, ముఖ్య అతిథి. 'లీడర్' పత్రిక సంపాదకులు వి.వి.రమణమూర్తి, మూడుదారులు పుస్తకాన్ని సమీక్షిస్తారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విశ్రాంత ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ పి. బాబీ వర్ధన్ సభకు అధ్యక్షత వహిస్తారు. పాత్రికేయ ప్రముఖులు మంగు రాజగోపాల్ గారు ఆత్మీయ ప్రసంగం చేస్తారు. రచయిత దేవులపల్లి అమర్ స్పందనతో సభా కార్యక్రమం ముగుస్తుంది.

**మూడు దారులు పుస్తకం గురించి :** వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్. చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాసేవలో వీరివి భిన్నమైన దారులు. తెలుగునాట రాజకీయాలపై తమదైన ముద్ర వేసిన నేతలు వీరు. ఈ ముగ్గురూ రాజకీయాల్లో ఎంచుకున్న దారుల గురించి, అనుసరించిన పద్ధతుల గురించీ విశ్లేషిస్తుందీ పుస్తకం. నలభయ్యేళ్ళపాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై తమదైన ముద్ర వేసిన ఎందరో నాయకులను అతి దగ్గరగా చూసిన రచయిత, తన అనుభవాన్నంతా మేళవించి రాసిన 'మూడు దారులు', నాయకుల రాజకీయ క్రీడలను, అధికారం కోసం వెన్నుపోట్లకు సైతం వెనుకాడని వారి తెగింపును కళ్ళకు కడుతుంది. ముఖ్యంగా చంద్రబాబు చేసిన 'వైస్రాయ్ కుట్ర' పాఠకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది.

తెలుగు రాష్ట్రాల ఆవిర్భావం మొదలు, విలీనం, విభజన వంటి పరిణామాలు, వాటి వెనుక ఉద్యమాలు, రాజకీయాలను రచయిత సాధికారికంగా ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీని రెండవ సారి చీల్చి కాంగ్రెస్ (ఐ) అనే కొత్త రాజకీయ పార్టీని 1978 లో ఇందిరాగాంధీ ఏర్పాటు చేయడం మొదలుకుని 2014లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన వరకూ అనేక పరిణామాలను, అందుకు కారణమైన నేతల వైఖరిని విపులంగా చర్చించింది ఈ పుస్తకం. గడచిన నలభయ్యేళ్లలో సంయుక్త ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన మర్రి చెన్నారెడ్డి మొదలుకుని నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి వరకూ 11 మంది ముఖ్యమంత్రులతో పాటు ప్రస్తుత విభజిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో చోటు చేసుకున్న సంఘటనలపై రచన విశ్లేషణాత్మకంగా సాగింది. పుస్తకం చదువుతున్నంతసేపూ రాజకీయ వేదికపై ఉత్కంఠభరితమైన తెలుగు సినిమా చూస్తున్నట్టుగా ఉంటుంది.

# హెచ్‌పిసిఎల్‌లో స్థానికులనే నియమించాలి : పాశర్ల ప్రసాద్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** హెచ్.పి.సి.ఎల్.లో స్థానికుల్నే నియమించాలి అని పార్టీ తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. హెచ్పిసిఎల్‌లో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విశాఖ రిఫైనరీ పరిశ్రమ పి ఆర్ ఓ కాళీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉన్న హెచ్ పి సి ఎల్ లో 30 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన నేపథ్యంలో పరిశ్రమ నుండి వెదజల్లే కాలుష్యం వలన పరిసర ప్రాంతాలలో ప్రజలకు ప్రాణహాని పొంచి ఉందని అన్నారు పరిశ్రమలో 70% ఉద్యోగాలు స్థానిక యువతకు కేటాయిస్తామని చెప్పిన ఇంతవరకు కేటాయించలేదని అన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని యాజమాన్యం చెప్పిన మాటలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు తక్షణమే స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని తెలుగుదేశం పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో విశాఖ అర్బన్ మాజీ ప్రధాన కార్యదర్శి పాండ్రంగి జయరాజు, విశాఖ పశ్చిమ నియోజకవర్గం టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి దేవర అప్పల రాజు, పారిశ్రామిక ప్రాంతం తెలుగుదేశం పార్టీ నాయకులు బర్రి సూర్య ప్రకాష్, వెంకటేశ్వరరావు, గోపి, వి ఐ సి ఎల్ యూనియన్ అధ్యక్షులు నరేంద్ర, మరియు నిరుద్యోగుల, పారిశ్రామిక ప్రాంతం తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అండగా ఉంటా-అధైర్య పడవద్దు

## మృతుల బంధువులకు ఆర్థిక సహాయం అందజేసిన ఎం.వి.వి. సత్యనారాయణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్థానిక జీవీఎంసీ 19వ వార్డు, పెదజాలరి పేట ప్రాంతములో ఇటీవల అనారోగ్యం కారణంగా పిల్లా అంకమ్మ (58) మృతి చెందారు. ఈ మేరకు మృతురాలి బంధువుల ఇళ్లకు విశాఖ పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త గౌరవనీయులు ఎం.వి.వి సత్యనారాయణ మంగళవారం వెళ్లి ఒక్కొక్క కుటుంబానికిగాను 5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా అదే వార్డులో అనారోగ్యంతో ఉన్న రెండు కుటుంబాలకు 5000 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రములో 19వ వార్డు వైసిపి ఇన్చార్జ్ సూరాడ వెంకట లక్ష్మి దాస్, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చంద్ర, బొండా శ్రీనివాసరావు, చొక్కార శేఖర రావు, వాడమోదుల గణేష్, బెహ్రా వసంత, గ్రామా పెద్దలు కన్వీనర్లు మహిళలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ సంస్థ 2024-25 అంచనా బడ్జెట్‌కు ఆమోదం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలకు ఆమోదం లభించింది. జిల్లాలోని గ్రంథాలయా ల్లోని మౌలిక వసతులు, అభివృద్ధి చర్యలు చేపట్టేందుకు గాను రూపొందించిన బడ్జెట్ అంచనాలపై రామా టాకీస్ సమీపంలోని శ్రీనగర్ కాలనీలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో సుదీర్ఘ చర్చ సాగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ సమావేశానికి అధ్యక్షత వహించగా సభ్యులు పలు అంశాలపై చర్చించి వారి సలహాలు, సూచనలు అందజేశారు. 2023-24 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలకు సంబంధించిన పద్దులపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ జి. లక్ష్మణరావు, డీపీవో కార్యాలయ ఏవో బీవీకే సత్యనారాయణ, వయోజన విద్యా శాఖ ఏడీ డి. చిన్నికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్. వెంకటరావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు లోకి వస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో అరకు, పాడేరు నియోజక వర్గాల మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల ప్రక్రియపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు చేయవలసిన పనులు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుపై అవగాహన కల్పించారు. జిల్లాలో 150 వరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండవచ్చని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించాలన్నారు. ప్రతీ నియోజక వర్గంలో మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్లు సూక్ష్మ పరిశీలకులు పర్యటించి ప్రతీ సంఘటనను పరిశీలిస్తారని చెప్పారు. సెక్టర్ అధికారుల బాధ్యతలను, విధులను వివరించారు. ఎన్నికల సామగ్రిని సెక్టర్ అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు తరలిస్తారని చెప్పారు.

గంటన్నర ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించాలని చెప్పారు. మాక్ పోలింగ్ పై అవగాహన కల్పించారు. ఈవి ఎంలు సక్రమంగా పనిచేయక పోతే తీసుకోవలసిన చర్యలు, అదనపు ఓటింగ్ యంత్రాలు సమకూర్చడం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గర్భవతులకు, బాలింతలకు, దివ్యాంగులకు, అంధులకు ప్రత్యేకంగా ప్రవేశం కల్పించి ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం కల్పించాలని సూచించారు.

ప్రెసైడింగ్ అధికారి డైరీ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు బహిరంగ సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ అధికారుల అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు పై అధికారులకు పూర్తి అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, ఎస్.డి. సి. పి. అంబేద్కర్, జిల్లా ఆడిట్ అధికారి సువర్ణ ఫణి, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, అరుకు, పాడేరు అసెంబ్లీ నియోజక వర్గాల మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్‌కు సాదర స్వాగతం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయం చేరుకున్న ఆయనకు సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్, రెవెన్యూ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. దేవులపల్లి అమర్ విశాఖలో మూడు రోజుల పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అధికార, రాజకీయ ప్రముఖులను కలుసుకుంటారు.

Sugar Free
Fitearly
నడివయస్కులకు దివ్య శక్తి
ఫిట్ ఎర్లీ
थकावट से सत्वर उपसमन
फिट एर्ली
వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?
మందులు మింగలేక, చక్కెరతో కూడిన
ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?
దిగులు చెందకండి.
"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం
శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.
సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ
తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కం మైన ఫలితాలను ప్రకటించు కోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com
HERBINDO LABS PRIVATE LIMITED
HEALTH AND HAPPINESS
Compli
HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# పోస్టల్ బ్యాలెట్స్ చాలా కీలకం



**విజయనగరం:** ప్రస్తుత పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్లు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పోస్టల్ బ్యాలెట్ల తయారీ, జారీ, స్వీకరణలో ఎక్కడా చిన్న పొరపాటు కూడా రాకూడదని స్పష్టం చేశారు. అన్ని దశల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించిన అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీలుగా ఎంపికైన డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణ చక్రవర్తి, జిల్లా బిసి సంక్షేమాధికారి కె.సందీప్ కుమార్ శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల తయారీ, ఓటింగ్, కౌంటింగ్, ఫెసిలిటేషన్ సెంటర్ సిబ్బంది నియామకం, ఇంటివద్దే ఓటింగ్ తదితర అంశాల గురించి వీరు వివరించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, గత ఎన్నికలతో పోలిస్తే, ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు, ఓటింగ్, కౌంటింగ్ విధానాల్లో పలు మార్పులు వచ్చాయని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల్లో ఇవన్నీ స్పష్టంగా ఉన్నాయని, వీటిని పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. గతంలో సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్లు జారీ చేసేవారని చెప్పారు. ప్రస్తుతం వీరితో పాటు ఆబ్సెంట్ ఓటర్ల విధానం కూడా కొత్తగా వచ్చిందని తెలిపారు. దీనిలో భాగంగా వయసు 80 సంవత్సరాలు దాటినవారు, 40 శాతం పైబడి వికలాంగత్వం ఉన్న విభిన్న ప్రతిభావంతులు, కోవిడ్ వ్యాధిగ్రస్తులు, అత్యవసర సర్వీసుల్లో ఉన్నవారు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకొనే అవకాశం కల్పించారని తెలిపారు. వీరు పోస్టల్ బ్యాలెట్ కోసం ముందుగా దరఖాస్తు చేసుకుంటే, నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం వాటిని జారీ చేయాల్సి ఉంటుందన్నారు.

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, కోవిడ్ వ్యాధిగ్రస్తులు తాము ఇంటి వద్దనుంచే ఓటు వేస్తామని కోరితే, ఆ మేరకు ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ ఏజెంట్లు కూడా వారి వెంట ఉండే అవకాశం ఉందన్నారు.

అలాగే పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు అవసరమైతే ప్రత్యేక కౌంటింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు. సర్వీసు ఓటర్లుకు మాత్రం ఆన్‌లైన్ ద్వారా బ్యాలెట్ పత్రం పంపబడుతుందని, వీరు ఓటు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. వీరి బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు, పార్టీలు మాత్రమే ఉంటాయని, పార్టీ గుర్తులు మాత్రం ఉండవని వివరించారు. ప్రతీ బ్యాలెట్ పత్రంపైనా ఆఖర్లో నోటా తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. అంధుల కోసం బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పత్రాన్ని కూడా పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. టెండరు బ్యాలెట్ పేపరు ఇవిఎంలో ఉన్న బ్యాలెట్ పత్రంలాగే ఉంటుందని చెప్పారు. ఇతర పోస్టల్ బ్యాలెట్ పత్రంలో కొద్దిగా తేడా ఉంటుందని చెప్పారు. చిన్న పొరపాటు కూడా పెద్ద ప్రభావాన్ని చూపిస్తుందని, అందువల్ల ప్రతీఒక్కరూ అప్రమత్తంగా విధులను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని, ఆ మేరకు సిబ్బందికి శిక్షణ ఇచ్చి, వివిధ అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని మాస్టర్ ట్రైనీలను కలెక్టర్ ఆదేశించారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, మెప్మా పిడి సుధాకరరావు, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ ప్రభాకర్, మాస్టర్ ట్రైనీలు, వివిధ నియోజకవర్గాల నుంచి డిప్యుటీ తాశిల్దార్లు పాల్గొన్నారు.

# 11, 12 వార్డులలో పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన కొనసాగుతుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె 2వ జోన్ 11,12 వార్డుల పరిధిలోని సూర్య తేజ నగర్, శ్రీకాంత్ నగర్ తదితర ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులకు పార్లమెంట్ సభ్యులు ఎం.వి.వి సత్యనారాయణ, వార్డ్ కార్పొరేటర్ అక్కరమాని రోహిణిలతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. విశాఖ నగరాభివృద్ధికి వైయస్సార్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, వైయస్సార్ ప్రభుత్వం తోనే విశాఖ అభివృద్ధి సాధ్యమన్నారు. ఆరిలోవ ప్రాంత ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్ల విస్తరణ, ఫుట్ పాత్ ల అభివృద్ధి, డ్రైనేజీ, సెంటర్ మీడియన్, అధునాతన విద్యుత్ దీపాలు, బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. మౌలిక వసతులు కల్పనే కాకుండా పేద ప్రజల ఉన్నతికి జగనన్న పాటు పడుతున్నారని, ముఖ్యంగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు నాలుగో విడత కింద జగనన్న చేయూతను అందించారని తెలిపారు.

అనంతరం పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గం పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, వైయస్సార్ ప్రభుత్వంతోనే విశాఖ నగరాభివృద్ధి సాధ్యమన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి విశాఖ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఆరిలోవ ప్రాంత అభివృద్ధికి, ఇక్కడ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, వైఎస్ ఆర్సిపి నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గంటం దొర మనవడు బోడి దొరకు వైద్య సేవలు అందిస్తాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిచే సత్కరింపబడిన స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన యోధుడు గాం గంటం దొర మనవడు బోడి దొర కొంతకాలంగా అనారోగ్యంగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆయనకు వైద్య సేవలు అందిస్తామని గిరిజన సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు అన్నారు. అలాగే కృష్ణదేవిపేటలో స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు, గంటం దొర సమాధులు ఉన్న అల్లూరి స్మారక పార్కులో కూలిపోయిన గోడ నిర్మించి, పార్కు అభివృద్ధికి తోడ్పడతానని ఆయన హామీ ఇచ్చారు. మంగళవారం జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, కార్యదర్శి శ్యామల వరలక్ష్మి, శివంగి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు పోతిన వెంకటేశ్వరరావు తదితరులు గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. చిన్న బాబును కలిసి బోడి దొరకు వైద్య సేవలు అందించాలని, అల్లూరి స్మారక పార్కు కూలిపోయిన గోడను నిర్మించి, పార్కు అభివృద్ధికి దోహదపడాలని ఆయనకు ఒక వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. వీటిపై స్పందించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిన్నబాబు వెంటనే పాడేరు పిఓ, ఏపీలకు ఫోను చేయడం జరిగింది. బుధవారం పిఓ, ఏపీఓలను స్వయంగా కలిసి వీటి పరిష్కారానికి కృషి చేస్తానని చిన్నబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుడు పి. శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# భూములకు పూర్తి పరిహారం అందించిన తరువాత పనులు చేపట్టాలి : తెదేపా నాయకులు రైతులు



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలో చందనాడ గ్రామం రెవెన్యూ పరిధిలో ఉన్నటువంటి బట్టీలు దగ్గర భూములు దౌర్జన్యం చేస్తూన్నారుని విషయం తెలుసుకున్న నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అనకాపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు చందనాడ రైతులతో కలిసి వెళ్లి పనులను ఆపిచేసి అక్కడున్న సాగుభూములు గాని డి ఫారం భూములు గానీ 80 శాతంపూర్తిగా రైతులకు న్యాయం చేయకుండా పనులు ఎలా చేస్తారని రైతు సమక్షంలో అధికారులను హెచ్చరించడం జరిగింది పూర్తిగా రైతులకు న్యాయం జరిగిన తర్వాతే ప్రభుత్వం పనులు ప్రారంభించారని రైతులకు నష్ట పరిహారం చెల్లించకుండా పనులు చేయాలని ఆలోచిస్తే అడ్డుకుంటామని రైతు సోదరులు సమక్షంలో అధికారులను నిలదీశారు, లేని సమక్షంలో రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అప్పలరాజు, పెదపూడి శంకర్రావు, సర్పంచ్ జనసేన పార్టీ గబ్బర్ సింగ్, పెదకాపు. సత్తిబాబు, బాబుజి, మాజీ వైస్ ప్రెసిడెంట్ సిరిపల్లి అప్పలరాజు మరియు రైతులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణలో అధికారులు భాగస్వామ్యం కావాలి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వామ్యం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, గొండు సీతారాంలు పేర్కొన్నారు.

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా , విజయనగరం, మన్యం, శ్రీకాకుళం జిల్లాల స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక శాఖ, విద్యా శాఖ, పోలీసు శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, బి.సి. వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, బాలలతో కలసి పనిచేస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బాలల హక్కులు, పరిరక్షణపై ప్రాంతీయ స్థాయి సమన్వయ సమావేశం మంగళవారం ఉదయం స్థానిక రాయల్ ఫోర్ట్ హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇటీవల కాలంలో నమోదైన బాలకార్మిక కేసులు, ప్రభుత్వం అందిస్తున్న మ్యాచింగ్ గ్రాంట్, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు, లబ్ది పొందిన వారి పూర్తి వివరాలపై కార్మిక శాఖాధికారులు నుండి చైర్మన్ ఆరా తీశారు. అలాగే ఈ ఆరు జిల్లాల్లో గత రెండేళ్లుగా జరిగిన బాల్య వివాహాల కేసులు, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, బాల్య వివాహాల చట్టంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమాలు, పోక్సో తదితర కేసుల నమోదు, ఆయా కేసుల్లో జన్మించిన పిల్లలకు జనన ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో ఎదురౌతున్న సమ స్యలపై వైద్య ఆరోగ్య శాఖ,స్త్రీ,శిశు సం క్షేమ శాఖ, విద్యా శాఖల సమన్వ యంపై అధికారులతో చర్చించారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో బాలల హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యా శాఖ, చైల్డ్ లైన్ విభాగం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో అధిగమిస్తున్న వివరాలపై కూలంకషంగా చర్చించారు. అలాగే మరిన్ని బాలల హక్కులు వారి సంక్షేమంపై ప్రభుత్వ శాఖల సహకారం, నిరాసక్తత వ్యక్తపరుస్తున్న అధికారుల వివరాలు సేకరించారు. ఇటువంటి అధికారులు తప్పనిసరిగా సహకరించాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. అలాగే గిరిజన ప్రాంతాల్లోని వివిధ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న శుచి, శుభ్రతతో భోజనం అందుతున్న తీరు తెన్నులు, ప్రభుత్వం నుండి అందుతున్న సహాయ సహకారాలు, అధికారుల సమన్వయంపై చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా చైర్మన్ కె. అప్పారావు, రాజేంద్ర ప్రసాద్, సీతారాంలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాలల హక్కులు, వారి సంక్షేమం శత శాతం నెరవేరాలనే ఏకైక ధ్యేయంతో సదస్సులో చర్చించిన వివిధ అంశాలతో ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్లు పేర్కొన్నారు.

చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించే దిశగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్,రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రాంతీయ స్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్త్రీ,శిశు, సంక్షేమ శాఖ ఆర్జేడీ జి.చిన్మయి దేవి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు క్రైం డీసీపీ వెంకటరత్నం, బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కో ఆర్డినేటర్ జి. తిరుపతిరావు,విశాఖ సి.డబ్ల్యూ.సి ఛైర్ పర్సన్ రాధ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మ న్లు, ఆరు జిల్లాల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, కార్మిక శాఖ ఉప కమిషనర్లు, వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, విద్యాశాఖాధికారులు, డిఆర్డిఎ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖాధికారులు, బిసి, ఎస్సీ, ఎస్టీ సం క్షేమ శాఖల అధికారులు, జిల్లా బాలల సంరక్షణ అధికారులు, పోలీసు శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676